PRABHATA SURYA
ప్రభాత సూర్య
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వేల రూ.5/ - పేజీలు : 8 గురువారం 17 జూలై 2025 సంపుటి: 01, సంచిక : 59
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## అమెరికా వార్నింగ్.. నష్టాల్లో స్టాక్‌మార్కెట్లు

రష్యాతో వ్యాపారం చేస్తే వంద శాతం సుంకాలు విధిస్తామని భారత్, చైనాలకు నాటో దేశాలు హెచ్చరికలు చేసిన నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు త్రైమాసిక ఫలితాల సీజన్ కావడం కూడా మార్కెట్ల ఒడిదుడుకులకు కారణమవుతోంది. మంగళవారం లాభాలను ఆర్జించిన దేశీయ సూచీలు బుధవారం మళ్లీ నష్టాల బాట పట్టాయి. రష్యాతో వ్యాపారం చేస్తే వంద శాతం సుంకాలు విధిస్తామని భారత్, చైనాలకు నాటో దేశాలు హెచ్చరికలు చేసిన నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు త్రైమాసిక ఫలితాల సీజన్ కావడం కూడా మార్కెట్ల ఒడిదుడుకులకు కారణమవుతోంది.

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news

# జల వివాదాలపై కమిటీ



- కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు
- రెండు రాష్ట్రాలతోపాటు కేంద్ర అధికారులకూ భాగస్వామ్యం
- సాంకేతిక నిపుణులు, ఐఏఎస్‌లకూ స్థానం
- టెలిమెట్రీల ఏర్పాటు, కృష్ణా బోర్డు అమరావతికి తరలింపు
- శ్రీశైలం ప్రాజెక్టుకు ఏపీ నిధులతో మరమ్మతులపైనా ఏకాభిప్రాయం
- ఢిల్లీలో ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రుల భేటీలో నిర్ణయాలు

**సూర్య న్యూస్ ఢిల్లీ, అమరావతి**

తెలుగు రాష్ట్రాల్లో గోదావరి, కృష్ణా జలాలకు సంబంధించి వివాదాల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ, ఏపీ సీఎంల సమావేశం నిర్ణయించింది. దీంతో పాటు మరో మూడు అంశాలపైనా ఏకాభిప్రాయం కుదిరింది. ఢిల్లీ శ్రమశక్తి భవన్ వేదికగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. దాదాపు గంటన్నరకు పైగా నిర్వహించిన ఈ సమావేశంలో తెలుగు రాష్ట్రాలు ప్రతిపాదించిన 10 ఎజెండా అంశాలపై చర్చ జరిగింది. తెలంగాణ, ఏపీ సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నీటిపారుదలశాఖ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నిమ్మల రామానాయుడు, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, విజయానంద్ చర్చల్లో పాల్గొన్నారు. జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ సమావేశాన్ని ప్రారంభించి, అవసరమైన సందర్భాల్లో కలగజేసుకున్నారు. ఎవరి వాదనలు వారు వినిపించడంతో ఆసక్తికర చర్చలు జరిగాయి.ఏపీ సీఎం చంద్రబాబు తనకు రెండు తెలుగు రాష్ట్రాలూ ముఖ్యమేనని స్పష్టం చేయడంతో పాటు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండగా తెలంగాణ ప్రాజెక్టులు ఎలా చేపట్టిందీ వివరించారు. సమావేశంలో మూడు అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. ఇది ఎపెక్స్ కౌన్సిల్ - మిగతా2లో



## సాగు వృద్ధికి 'ధనధాన్య కృషి'

- వెనుకబడిన 100 జిల్లాల్లో ఆరేళ్ల అమలు
- 36 పథకాలను ఒక్కటిచేస్తూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం
- దీనికి రూ.24,000 కోట్ల బడ్జెట్ కేటాయింపు



## వచ్చే నెలలో మోదీ చైనా పర్యటన!

- గల్వాన్ లోయ ఘర్షణ తర్వాత తొలిసారిగా చైనాకు..
- షాంఘై సహకార సంస్థ సదస్సుకు హాజరు కానున్న ప్రధాని

## తెలంగాణ ప్రజలకు మేము జవాబుదారీ

- సీఎంల సమావేశంలో బనకచర్ల ప్రతిపాదనే రాలేదు
- ఈ భేటీ విఫలమైతే బాగుండని కొందరు ఎదురుచూశారు
- అధికారం కోల్పోయిన దుఃఖం వారిది
- వారికి పదేళ్ల అవకాశమిచ్చినా పరిష్కరించలేదు
- సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే మా బాధ్యత
- నదీ జలాల వివాదాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి






## ఆకాశ్ ప్రైమ్ పరీక్ష విజయవంతం

- సముద్రమట్టానికి 15వేల అడుగుల ఎత్తులో పరీక్ష
- క్షిపణిని అభివృద్ధి చేసిన రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) సహకారంతో లద్దాఖ్ సెక్టార్‌లో ఈ ప్రయోగపరీక్షలు
- అననుకూల వాతావరణంలోనూ పూర్తి సమర్థతతో పనిచేసి క్షిపణి తన సత్తా చాటింది.

## ఐఎస్ఎస్‌లో 7 ప్రయోగాలు చేసిన శుభాంశు



## వాయుగండం

- గాలుల తీవ్రతతోనే వానలకు ఆటంకం అంటున్న వాతావరణ శాస్త్రవేత్తలు
- తెలంగాణలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు
- సగటున 28 శాతం లోటు వర్షపాతం
- ఆదిలాబాద్‌లో మాత్రమే సాధారణ వర్షపాతం
- ఈ నెలాఖరులో వర్షాలు కురిసే అవకాశం
- వాతావరణ విభాగం నిపుణుల అంచనా

**సూర్య న్యూస్ హైదరాబాద్**

'ముందస్తు'గా మురిపించిన వర్షాలు కీలక సమయంలో ముఖం చాటేయటంతో రాష్ట్రంలో వాతావరణం వేసవిని తలపిస్తోంది. నైరుతి రుతుపవనాల సీజన్ లో సమృద్ధిగా వానలు కురవాల్సిన సమయంలో.. మొగులు కోసం రైతన్న దిగులుగా చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రుతుపవనాల కదలికలు మందగించడం, నిలకడలేని తీవ్రగాలుల ప్రభావంతో వర్షాలు జాడ - మిగతా2లో

# 'స్థానిక' స్థానాలు ఖరారు

- 566 జడ్పీటీసీ.. 5,773 ఎంపీటీసీ స్థానాలు
- రాష్ట్రంలో జెడ్పీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీల సంఖ్య వెల్లడి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం.. 2019 ఎన్నికలతో పోల్చితే తగ్గిన స్థానాలు
- రాష్ట్రంలో 12,778 పంచాయతీలు, 1,12,694 వార్డులు
- ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు.. 2019తో పోలిస్తే తగ్గుదల




**సూర్య న్యూస్ హైదరాబాద్**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం తెలంగాణలో జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం(జడ్పీటీసీ), మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం (ఎంపీటీసీ), గ్రామ పంచాయతీలు, వార్డు స్థానాల సంఖ్యను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 566 జడ్పీటీసీ స్థానాలు, ఆ మేరకు మండల ప్రజా పరిషత్(ఎంపీపీ)లు, 5,773 ఎంపీటీసీ స్థానాలు, 12,778 గ్రామ పంచాయతీలు, వార్డులు 1,12,694 ఉన్నట్లు వెల్లడించింది. 2019 ఎన్నికలతో పోలిస్తే రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు, గ్రామ పంచాయతీలు, వార్డుల సంఖ్య తగ్గింది. మేడ్చల్–మల్కాజిగిరిని అర్బన్ జిల్లాగా మార్చడంతో జిల్లా ప్రజా పరిషత్(జడ్పీపీ)ల జాబితా నుంచి దానిని తొలగించారు. 2019 తర్వాత పురపాలికలు, నగరపాలికల్లో భారీఎత్తున గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. - మిగతా2లో

# జల వివాదాలపై కమిటీ

-మొదటిపేజీ తరువాయి

సమావేశం కాదు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత నదీ జల వివాదాలు పరిష్కరించేందుకు విభజన చట్టం ప్రకారం ఎపెక్స్ కౌన్సిల్ ఏర్పాటయింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి నేతృత్వంలో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అందులో సభ్యులు. ఇంతవరకు రెండుసార్లు ఎపెక్స్ కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. ప్రస్తుతం అదే తరహా సమావేశం కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేయడంతో ఈ సమావేశంపై అనుమానాలు ఏర్పడ్డాయి. దీంతో భేటీ ప్రారంభంలోనే ఏపీ సీఎం చంద్రబాబు ఇది ఎపెక్స్ కౌన్సిల్ సమావేశమా అని ప్రశ్నించారు. కాదని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ సమాధానమిచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి ఇదొక వేదికగా నిలుస్తుందని, ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకుంటే వాటిని అమలు చేస్తామని వెల్లడించారు. ఇందుకు తగ్గట్టే సమావేశం యావత్తూ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి పాటిల్ ప్రేక్షక పాత్ర వహించారు.

**కమిటీ తేల్చని అంశాలు సీఎంల వద్దకే..**

జలవివాదాలపై కమిటీ ఏర్పాటు వచ్చే సోమవారం నాటికి పూర్తి కావాలని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎవరెవరు కమిటీలో ఉండాలో ఆ వివరాలు తాము సోమవారం నాటికి అందిస్తామని రెండు రాష్ట్రాలూ పేర్కొన్నాయి. దేబశ్రీ ముఖర్జీ స్పందిస్తూ, సోమవారం నాటికి కేంద్రం నుంచి కమిటీ సభ్యులను తేల్చడానికి ప్రయత్నిస్తామన్నారు. ప్రస్తుత ఎజెండా అంశాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్న వాటిని కమిటీకి అప్పజెబుతారు. సాంకేతిక, ఇతర అంశాలపై ఆ కమిటీ చర్చించి అభిప్రాయాలు, నిర్ణయాలు తెలియజేస్తుంది. అక్కడ పరిష్కారం కాని అంశాలపై మళ్లీ ఇద్దరు ముఖ్యమంత్రులూ చర్చించి పరిష్కరించుకోవాలని




నిర్ణయించారు.

**ఇవీ నిర్ణయాలు**

1. గోదావరి, కృష్ణా నదులకు సంబంధించి వివాదాల పరిష్కారానికి కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు. రెండు రాష్ట్రాల సాంకేతిక నిపుణులతో పాటు జలశక్తి శాఖ నుంచి కమిటీలో సభ్యులు ఉంటారు. సాంకేతిక నిపుణులు, ఇంజినీర్లు మాత్రమే కాకుండా పాలనాధికారు (ఐఏఎస్)లకు కూడా ఈ కమిటీలో భాగస్వామ్యం కల్పిస్తారు. వచ్చేవారం ప్రారంభానికి కమిటీ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తారు. ఈ కమిటీ నెల రోజుల్లో రోడ్‌మ్యాప్ ఇస్తుందని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. పోలవరం– బనకచర్ల అనుసంధానం అంశాన్ని కూడా ఈ కమిటీ పరిశీలిస్తుందని ఏపీ మంత్రి రామానాయుడు తెలియజేశారు.
2. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని అమరావతికి తరలింపు.
3. కృష్ణా, గోదావరి నదుల నుంచి కాలువలకు నీళ్లు తీసుకునే అవుట్‌లెట్‌ల వద్ద టెలిమెట్రీల ఏర్పాటుకు అనుమతి. కేవలం ఆయా నదులకు సంబంధించిన రిజర్వాయర్ల నుంచి నీటిని తీసుకునేచోట మాత్రమే టెలిమెట్రీల ఏర్పాటు. అంతర్గత అవుట్‌లెట్‌ల వద్ద ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని ఆంధ్రప్రదేశ్ పేర్కొంది.
4. శ్రీశైలం ప్లంజ్‌పూల్ సహా అవసరమైన మరమ్మతు పనులు ఏపీ చేపట్టేందుకు నిర్ణయం.

ఈ మేరకు రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నట్లు ఆ తర్వాత కేంద్ర జలశక్తి శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజల ప్రయోజనార్థం సుస్థిర జల నిర్వహణ పద్ధతులను ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించింది.

# తెలంగాణ ప్రజలకు మేము జవాబుదారీ

హైదరాబాద్

'ప్రజలు వాళ్లకు పదేళ్లు అధికారం ఇచ్చినా నదీ జలాల వివాదాలను పరిష్కరించలేదు. ఈరోజు జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో నాలుగు అంశాలకు పరిష్కారం లభించింది. మిగతా సమస్యల పరిష్కారానికి దారి లభించింది' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'ఈ సమావేశం ఎలాగైనా చెడిపోతే బాగుండు.. వీళ్లు గొడవ పడితే బాగుండు.. దాంతో మాకు రాజకీయంగా లాభం జరుగుతుంది..' అని కొందరు ఎదురుచూశారని వ్యాఖ్యానించారు. "వాళ్లనేం చేస్తాం? చూసి జాలిపడతాం. వాళ్ల బాధ మేము అర్థం చేసుకుంటాం. అధికారం పోయిన దుఃఖంలో వారు ఇలాంటి ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. మేము వాళ్ల కోసం లేము. తెలంగాణ ప్రజలకు జవాబుదారీగా ఉన్నాం. పరిపాలన ఏ విధంగా చేయాలో మాకు తెలుసు. సమస్యలను ఎలా పరిష్కరించాలో మాకు అవగాహన ఉంది. వివాదాలు చెలరేగకుండా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే మా బాధ్యత" అని స్పష్టం చేశారు. ఢిల్లీలో విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్ పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. "గోదావరి.. బనకచర్ల కడతామని వారు(ఏపీ) అడిగితే కదా.. మేము ఆపమని చెప్పడానికి. ఆ ప్రతిపాదనే రానప్పుడు.. ఆపమనే చర్చే రాదు. ఇది ఎపెక్స్ కమిటీ సమావేశం కాదు.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అంశాలపై చర్చించడానికి జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సమావేశం. కేంద్రం ఏ రాష్ట్రం పక్షానా నిలబడలేదు. ఏ ఎజెండాను కూడా సూచించలేదు. సమావేశంలో జలశక్తి మంత్రి పాటిల్ జడ్జి పాత్ర పోషించారు. ఏపీ కడుతున్న ప్రాజెక్టుల మీద మేము ఇప్పటికే ఫిర్యాదులు చేశాం. మా ఫిర్యాదుల మీద పోలవరం ప్రాజెక్టు అథారిటీ, సీడబ్ల్యూసీ, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు.. ఏపీ ప్రభుత్వానికి అభ్యంతరాలు చెప్పాయి. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న సంస్థలే.. అన్ని రకాల అభ్యంతరాలు లేవనెత్తాయి కాబట్టి సమావేశంలో ఆ అంశాలు ప్రస్తావనకు రాలేదు.

**ఇది తెలంగాణ విజయం**

మొత్తం తెలంగాణ హక్కులను కేసీఆర్.. ఏపీకి ధారాదత్తం చేశారు. అన్యాయం చేశారు. వాటిని పరిష్కరించడానికి మేము విధి విధానాలను ముందుకు తీసుకొచ్చాం. ఇది తెలంగాణ రాష్ట్ర విజయం. ఎందుకంటే ఏపీ తనకు కేటాయించిన నీళ్ల కంటే ఎక్కువ వినియోగిస్తుందని మేము ఫిర్యాదు చేసిన నేపథ్యంలో.. టెలీమెట్రీల ఏర్పాటుకు ఏపీ అంగీకరించింది. శ్రీశైలం డ్యామ్ నిర్వహణకు,




మరమ్మతులకు, రక్షణకు కూడా ఏపీ ప్రభుత్వం అంగీకరించింది. ఇది కూడా తెలంగాణ ప్రభుత్వ విజయమే. దీర్ఘకాలిక పెండింగ్ అంశాలు గుర్తించడం కోసం కమిటీ ఏర్పాటుకు కూడా నిర్ణయం జరిగింది. గతంలో ఎపెక్స్ కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలు అమలయ్యాయా? పార్లమెంటులో చట్టం చేస్తేనే.. ప్రధాని మోదీ అంగీకరించడం లేదు. అలా అనుమానించుకుంటూ పోతే ఏ అంశం పరిష్కారం కాదు. మేము నియమించిన కమిటీనే కదా.. ఆ కమిటీ సిఫార్సులను గౌరవిస్తాం. అంశాల వారీగా చర్చిస్తాం. తర్వాత తుది నిర్ణయం తీసుకుంటాం. చర్చిస్తున్నప్పుడు.. పోరాడాల్సిన అవసరం ఏముంది? అవసరమైనప్పుడు గల్లీ నుంచి ఢిల్లీ దాకా కొట్లాడతాం. అందుకు సిద్ధంగానే ఉన్నాం" అని రేవంత్ అన్నారు.

**నిధులు ఇచ్చినా, ఇవ్వకపోయినా అన్ని చోట్లా టెలీమెట్రీలు**

"కృష్ణా జలాలలో.. ఏపీ ఎన్ని వినియోగిస్తుంది.. తెలంగాణ ఎన్ని వినియోగిస్తుందనేది గుర్తించడానికి, ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల లెక్కలు తేల్చేందుకు.. టెలీమెట్రీ పరికరాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన సూచనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించింది. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం కొన్నిచోట్ల టెలీమెట్రీలను ఏర్పాటుచేసింది. మిగిలిన అన్నిచోట్లా ఈ పరికరాలను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం, ఏపీ ప్రభుత్వం నిధులు ఇచ్చినా, ఇవ్వకపోయినా.. తెలంగాణ ప్రభుత్వమే అన్నిచోట్లా టెలీమెట్రీ పరికరాలను యుద్ధప్రాతిపదికన పెట్టాలని నిర్ణయించాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో జరిగిన రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీలో పాల్గొన్న అనంతరం బుధవారం ఒక హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ మాట్లాడారు. "కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం కావడం ఆహ్వానించదగిన పరిణామం. అన్ని సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని నిర్ణయం తీసుకున్నాం. శ్రీశైలం డ్యామ్‌లో కొన్ని ప్రమాదకరమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. తక్షణం మరమ్మతులు చేయాలని ఎన్డీఎస్ఏ సహా పలు సంస్థలు ఇచ్చిన నివేదికల్లోని అంశాలను భారత, ఏపీ ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాం. శ్రీశైలం ప్రాజెక్టుకు మరమ్మతులు, రక్షణ, నిర్వహణలకు సంబంధించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించింది. ఏపీ పునర్విభజన చట్టంలో ఉన్నట్లుగా.. 2020లో ఎపెక్స్ కౌన్సిల్‌లో అప్పటి ముఖ్యమంత్రులు తీసుకున్న నిర్ణయం ప్రకారం.. గోదావరి బోర్డు హైదరాబాద్‌లో.. కృష్ణా బోర్డు ఏపీలో ఏర్పాటుకు తుది నిర్ణయం జరిగింది. ఇరు రాష్ట్రాల్లో గోదావరి, కృష్ణా నదులపై ఉన్న ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ సమస్యలను గుర్తించడానికి, చర్చించడానికి, పరిష్కారానికి సీనియర్ అధికారులు, ఇంజినీర్లు, నిపుణులతో కమిటీని వారం రోజుల్లో నియమించాలని నిర్ణయించాం. గోదావరి నది, దాని ఉపనదులు.. కృష్ణా నది, దాని ఉపనదులకు సంబంధించి అన్నీ చర్చకు వస్తాయి. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, నిర్మాణానికి ప్రతిపాదించిన ప్రాజెక్టులు, ఇప్పుడున్న ప్రాజెక్టుల్లో నిర్వహణలో అంశాలు, అభ్యంతరం ఉన్న ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, అనుమతులు.. అన్నీ ప్రస్తావనకు వస్తాయి. వీటన్నింటిపై 30 రోజుల్లో మన తరపున అధికారులు, ఇంజినీర్లు, నిపుణులు కమిటీ గుర్తించి చర్చకు తీసుకొస్తారు. ఆ కమిటీలో చర్చించిన తర్వాత.. ముఖ్యమంత్రుల స్థాయిలో మరోసారి భేటీ అయి చర్చించుకోవాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ సమావేశంలో కేవలం పెండింగ్ అంశాలపై మాత్రమే చర్చించాం. ముందు సమస్యలను గుర్తించాలని నిర్ణయించాం. ఆ తర్వాత పరిష్కారంపై చర్చిస్తాం" అని సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, కె.రఘువీర్‌రెడ్డి, వంశీకృష్ణ, అభిషేక్ మను సింఘ్వీ, మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రామసహాయం రఘురామిరెడ్డి, కడియం కావ్య, బలరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ గుట్టు రట్టయ్యింది

హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి 48వ ఢిల్లీ పర్యటన గుట్టురట్టయ్యిందన్న కేటీఆర్.. ముసు గు వీడింది.. నిజం తేటతెల్లమయ్యిందన్నారు. "నిధులు రాహుల్ గాంధీకి.. నీళ్లు చంద్రబాబుకి.. బనకచర్ల గురిం చి చర్చే రాలేదని బుకాయిస్తున్నారు. గురుదక్షిణగా గోదా వరి జలాలను అప్పజెప్పడానికేనా?. నువ్వు గద్దెనెక్కింది" అంటూ ఎక్స్ వేదికగా రేవంత్‌పై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు."కోవర్టులెవరో, తెలంగాణ కోసం కొట్లాడిందెవరో తేలిపోయింది. ఒక్క బొట్టు నీరు అక్రమంగా అప్పజెప్పినా పోరాటం తప్పదు. తెలంగాణను పీక్కుతింటున్న రాబందుల పని పడతాం" అంటూ కేటీఆర్ హెచ్చరించారు. నీ గురువుపై విశ్వాసం చూపించడానికి తెలంగాణ విధ్వంసం కావలసిందేనా?. ఇంకెందుకు రెండు రాష్ట్రాలు, ఇద్దరు ముఖ్యమంత్రులు?. నిన్ను ఎన్నుకున్న పాపానికి చెరిపేయి సరిహద్దులు! తెలంగాణా మీద నీ అక్కసు చల్లారుతుందేమో!" అంటూ కేటీఆర్ పోస్ట్ చేశారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రతిపక్ష, అధికార పార్టీల నడుమ సవాళ్ల పర్వం కొనసాగుతోంది. మరోసారి సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు తెలంగాణ భవన్‌లో జరిగిన దళిత బంధు సాధనసమితి సమావేశంలో రేవంత్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌కు దమ్ముంటే.. కూలిందంటున్న మేడిగడ్డ బ్యారేజి మీదనే చర్చ పెడదాం అని.. చర్చకు.. రా అని సవాలు విసిరి చర్చకు వెళితే రేవంత్ రెడ్డి పారిపోయిండని చురకలు అంటించారు. చర్చకు వస్తవా అని పిలిచి పారిపోయిన పిరికి సన్నాసి రేవంత్ రెడ్డి అని సెటైర్లు వేశారు.
మరొకసారి నాగార్జునసాగర్ కట్టపైన చర్చకు వస్తావా అని సవాల్ విసిరిండని.. రేవంత్ రెడ్డికి తెలివిలేక కాళేశ్వరాన్ని కులేశ్వరం అంటున్నారని ఫైరయ్యారు. నాగార్జునసాగర్ కట్టమీద కాదు.. కానీ మేడిగడ్డ బ్యారేజ్ మీద చర్చకు రావాలని సవాలు విసిరారు. తుంగతుర్తి సూర్యాపేట నియోజకవర్గం చివరి మడి వరకు నిలిచిన నాయకుడు కేసీఆర్ అన్న సంగతి రేవంత్‌కు తెలుసునని కేటీఆర్ అన్నారు.

## 'స్థానిక' స్థానాలు ఖరారు

-మొదటిపేజీ తరువాయి

దీంతో పంచాయతీలు, వార్డుల సంఖ్య తగ్గింది. గ్రామాల సంఖ్య తగ్గుదల కారణంగా ఎంపీటీసీలు, ఎంపీపీ స్థానాలు, జిల్లా పరిషత్‌లు కూడా తగ్గాయి. ఉమ్మడి రాష్ట్రంలోగానీ, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గానీ జిల్లా ప్రజా పరిషత్ స్థానం తగ్గడం ఇదే ప్రథమం. గత ఎన్నికల సమయంలో మేడ్చల్‌లో ఐదు జడ్పీటీసీలకు ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు వాటన్నింటిని పురపాలికలుగా మార్చారు. ఒక్క స్థానమూ లేకపోవడంతో మేడ్చల్ జిల్లా ప్రజా పరిషత్ స్థానం రద్దయింది. దీంతో జడ్పీపీల సంఖ్య 31కి చేరింది.

## వాయుగండం

-మొదటిపేజీ తరువాయి

లేకుండా పోయాయి. ఇదే సమయంలో తెలంగాణ ఎగువన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈసారి రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశించడంతో ఈ సీజన్‌లో వర్షాలు జోరుగా ఉంటాయని అంచనా వేశారు. ఈ అంచనాలు తలకిందులు కావటానికి ఎక్కువ రోజులు పట్టలేదు. నైరుతి రుతుపవనాల సీజన్‌లోనే రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. ఇప్పటివరకు రాష్ట్రంలో సగటున 24.34 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాలి. కానీ 17.59 సెంటీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. సీజన్‌లో కేవలం జూన్, జూలై నెలల్లోనే ఎక్కువ వర్షాలు కురుస్తుంటాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత వరుసగా రెండు నెలలపాటు లోటు వర్షపాతం నమోదు కావడం ఇదే ప్రథమం అని వాతావరణ శాఖ వర్గాలు చెబుతున్నాయి.
ఆదిలాబాద్ జిల్లాలో మాత్రమే సాధారణం కంటే 2 శాతం అధిక వర్షపాతం నమోదైంది. మిగతా 32 జిల్లాల్లో లోటు వర్షపాతమే ఉంది. ఏడు జిల్లాల్లో 20 శాతం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. కుమ్రంభీం ఆసిఫాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో సాధారణం కంటే తక్కువగా వర్షపాతం నమోదైంది. 24 జిల్లాల్లో వర్షపాతం భారీ లోటు నమోదైంది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగుడెం, హబుబాబాద్, వరంగల్, హన్మకొండ, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, మెదక్, జనగామ, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, ములుగు, నారాయణపేట జిల్లాల్లో 20 నుంచి 60 శాతం లోటు ఉంది.
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఏకంగా 62 శాతం తక్కువ వర్షాలు కురిశాయి.

**వేసవి ఎండలు తక్కువగా ఉండడంవల్లే..**

రాష్ట్రంలో సాధారణంగా వేసవి సీజన్‌లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. కానీ, ఈ ఏడాది వేసవిలో సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత 20 సంవత్సరాల్లో మే నెలలో అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలు ఈ సారి నమోదు కావడం గమనార్హం. ఎండల తీవ్రత తక్కువగా ఉంటే వర్షాలు సైతం తక్కువగానే ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అదేవిధంగా మే నెలలో వర్షాలు అధికంగా కురవడం కూడా ప్రస్తుత వర్షాభావ పరిస్థితులకు మరో కారణమని అంటున్నారు. రాష్ట్రంలో వానలు బాగా కురవాలంటే బంగాళాఖాతంలో వాతావరణ మార్పులు కీలకమని నిపుణులు చెబుతున్నారు.

**గాలుల తీవ్రతతో వానలకు ఆటంకం**

నైరుతి సీజన్‌లో గాలుల తీవ్రత విపరీతంగా ఉంది. నిలకడలేని గాలుల కారణంగా వర్షాలు కురవడం లేదు. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం, అల్పపీడనం లాంటివి ఏర్పడితే రాష్ట్రంలో వర్షాలకు అనుకూల పరిస్థితులు ఉండేవి. కానీ ఈ సీజన్‌లో ఇప్పటివరకు అలాంటివేవీ నమోదు కాలేదు. ఉపరితల ఆవర్తనం, అల్పపీడనం లాంటివి కనీసం రెండుమూడు రోజుల పాటు కొనసాగితే వర్షాలు సమృద్ధిగా కురిసేవి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వానలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ... తెలంగాణలో మాత్రం తక్కువగా ఉన్నాయి. మరో వారం తర్వాత పరిస్థితులు మారుతాయని అంచనా వేస్తున్నాం.

## ఢిల్లీ భేటీ ఎజెండాలో మొదటి అంశమే గోదావరి-బనకచర్ల




హైదరాబాద్

"తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు ఢిల్లీలో జరిపిన భేటీలో మొదటి అంశమే గోదావరి–బనకచర్ల. అసలు బనకచర్ల అంశం ఎజెండాలో లేనప్పుడు.. ఆపాలనే ముచ్చట రాదని సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారు. ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు మాత్రం బనకచర్లపై చర్చించామని, పరిష్కారం కోసం కమిటీ వేశామని అంటున్నారు. మరి ముఖ్యమంత్రి అవాస్తవాలు మాట్లాడవచ్చా? రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడానికి ప్రజలు మిమ్మల్ని ఎన్నుకున్నారు. ఏపీకి, చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందుకు కాదు. అబద్ధాలు చెప్పినందుకు రాష్ట్ర ప్రజలకు సీఎం క్షమాపణ చెప్పాలి. తెలంగాణ ప్రయోజనాలకు ద్రోహం చేస్తే సహించేది లేదు" అని భారత రాష్ట్ర సమితి సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో భారత రాష్ట్ర సమితి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిలతో కలిసి బుధవారం హరీశ్‌రావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "బనకచర్లపై సమావేశం పెడితే.. ఢిల్లీకి వెళ్లబోమని లీకులిచ్చిన రేవంత్‌రెడ్డి ఎందుకు వెళ్లారు? అర్ధరాత్రి జరిగిన చీకటి ఒప్పందం ఏమిటి? గోదావరి–బనకచర్ల అంశంపై కేంద్ర ప్రభుత్వం సమావేశం పెట్టడం తప్పు. సీడబ్ల్యూసీ, జీఆర్ఎంబీ, పోలవరం ప్రాజెక్టు అథారిటీలు బనకచర్ల ప్రి ఫీజిబిలిటి రిపోర్టును తిరస్కరించాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థలు తిరస్కరించాక.. కేంద్రం ఎలా సమావేశం ఏర్పాటు చేసింది? కమిటీ ఏర్పాటుపై రేవంత్ సంతకం ఎందుకు పెట్టారు? మొన్నటి పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో చంద్రబాబును ఒక్క మాట కూడా అనలేదు. రేవంత్ పోరాటం ఎవరి మీద? తెలంగాణ సాధించిన కేసీఆర్‌పైనా? తెలంగాణకు మోసం చేస్తున్న చంద్రబాబుపైనా? రాష్ట్రంలో నడుస్తున్నది కాంగ్రెస్ పాలన కాదు... భాజపా, తెదేపాల రిమోట్ పాలన. భాజపా, కాంగ్రెస్‌లు తెలంగాణకు ద్రోహం చేస్తున్నాయి. టెలిమెట్రీలు కొత్తగా పెట్టేదేముంది? పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు వరకు భారత రాష్ట్ర సమితి హయాంలోనే పెట్టారు. బనకచర్లకు భారత రాష్ట్ర సమితి ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోదు" అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# సాగు వృద్ధికి 'ధనధాన్య కృషి'

దిల్లీ

దేశంలో వెనుకబడిన 100 జిల్లాల్లో వ్యవసాయానికి చేయూతనందించడానికి కేంద్ర ప్రభుత్వం కొత్తగా 'ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన'ను అమలుచేయాలని నిర్ణయించింది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్రమంత్రివర్గ సమావేశం దీనికి ఆమోదముద్ర వేసింది. కేంద్రంలోని 11 మంత్రిత్వ శాఖల్లో అమల్లో ఉన్న 36 పథకాలను సమ్మిళితం చేసి ఈ పథకాన్ని అమలుచేయనున్నారు. వాటికింద ఏటా ఖర్చుచేసే రూ.24,000 కోట్లనే ఈ పథకానికి కేటాయిస్తారు. 2025–26 ఆర్థిక సంవత్సరం నుంచి ఆరేళ్లపాటు ఇది అమల్లో ఉంటుంది. ప్రతి రాష్ట్రం నుంచి కనీసం ఒక జిల్లాను ఈ పథకానికి ఎంపిక చేస్తారు. ఉత్పాదకత, సాగు విస్తీర్ణం, రుణ వినియోగం.. ఈ మూడూ తక్కువగా ఉన్న జిల్లాలను ఎంపికచేసి మిగతా జిల్లాలతో సమానంగా పైకి తీసుకురావడానికి చేయూతనందిస్తారు. దీనికింద 1.7 కోట్లమంది రైతులకు ప్రయోజనం లభిస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులకు వెల్లడించారు. పథకం ప్రధానోద్దేశం.. ఈ 100 జిల్లాల్లో పంట ఉత్పాదకత పెంచడం, పంటల మార్పిడి, సుస్థిర వ్యవసాయ విధానాలను ప్రోత్సహించడంబీ పంచాయతీ, మండల స్థాయిల్లోనే పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని పెంచడమేనని చెప్పారు. ఉత్పాదకతను పెంచడానికి సాగునీటి సదుపాయాలు, స్వల్ప–దీర్ఘకాల రుణ వితరణను విస్తృతం చేయనున్నట్లు వివరించారు.ధనధాన్య కృషి యోజనను సమర్థంగా అమలు చేయడానికి అవసరమైన ప్రణాళికల రూపకల్పనకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటుచేస్తారు. జిల్లా ధనధాన్య సమితి.. జిల్లాస్థాయి వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాల ప్రణాళికను ఖరారు చేస్తుంది. ఇందులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, అభ్యుదయ రైతులు



సభ్యులుగా ఉంటారు. పంటల వైవిధ్యం పాటించడంతోపాటు నీరు, భూసార సంరక్షణ, వ్యవసాయ, దాని అనుబంధ రంగాల్లో స్వయంసమృద్ధి సాధించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తారు. ప్రతి జిల్లాలో ఈ పథకం పురోగతిని 117 ముఖ్యమైన సూచికల ఆధారంగా లెక్కిస్తారు. డ్యాష్‌బోర్డు ఏర్పాటుచేసి నెలవారీగా విశ్లేషిస్తారు. నీతి ఆయోగ్ కూడా ఎప్పటికప్పుడు సమీక్షించి జిల్లాలకు మార్గనిర్దేశం చేస్తుంది. పథకం అమలుకోసం ప్రతి జిల్లాకు కేంద్ర నోడల్ అధికారి ఉంటారు. పునరుత్పాదక ఇంధనోత్పత్తి రంగంలో మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వరంగ ఎన్‌టీపీసీకి క్యాబినెట్ అనుమతిచ్చింది. రూ.20వేల కోట్ల నిధులు సమీకరించుకునేందుకు పచ్చజెండా ఊపింది. 2032నాటికి 60 గిగావాట్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తికి వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల ఎన్‌టీపీసీ, దాని అనుబంధ సంస్థ ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌లు దేశవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి ప్రాజెక్టులను వేగవంతం చేయడానికి వీలవుతుంది. నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ రూ.7వేల కోట్లను ఎన్‌ఎల్‌సీ ఇండియా రెన్యూవబుల్స్ లిమిటెడ్‌లో పెట్టుబడి పెట్టడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రోదసిలో 18 రోజులు గడిపి విజయవంతంగా భూమికి తిరిగివచ్చిన వ్యోమగామి శుభాంశు శుక్లాను అభినందిస్తూ మంత్రివర్గం తీర్మానం చేసింది. భారత అంతరిక్ష కార్యక్రమంలో ఇది నూతన అధ్యాయాన్ని లిఖించిందని, దేశానికిది గర్వకారణమని శ్లాఘించింది.

# ఐఎస్ఎస్‌లో 7 ప్రయోగాలు చేసిన శుభాంశు

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) లోకి అడుగు పెట్టిన తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా ఘనత సాధించారు. యాగ్జియం –4 మిషన్‌లో భాగంగా శుభాంశు చేపట్టిన అంతరిక్ష యాత్ర విజయవంతంగా ముగియటంతో ఇక ఇప్పుడు – ఐఎస్ఎస్‌లో ఉన్న ఈ 18 రోజుల్లోనూ ఆయన జరిపిన 7 ప్రధాన ప్రయోగాలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి మొదలైంది. భారత్ ఎంతో ప్రతిష్టాత్మకమైనదిగా భావిస్తున్న భవిష్యత్ మానవ సహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'కు ఇవి ఎంతో ఉపయుక్తమైనవి కావటం వలన కూడా ఈ ప్రయోగాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సూక్ష్మ గురుత్వాకర్షణ శక్తిలో వివిధ జీవ, భౌతిక వ్యవస్థలను అధ్యయనం చేయటానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు వంటి ప్రసిద్ధ భారతీయ పరిశోధన సంస్థలు రూపొందించిన ఆ ప్రయోగాలు ఏమిటో చూద్దాం.



**1 టార్డిగ్రేడ్**

ఏంటివి?: టార్డిగ్రేడ్‌లు అంటే నీటి ఎలుగు బంట్లు. ఎనిమిది కాళ్లుండే సూక్ష్మజీవులు. ఇవి అధిక ఉష్ణోగ్రతలు, రేడియేషన్ వంటి తీవ్ర ప్రతికూల పరిస్థితులలో కూడా ఎక్కువ కాలం జీవించగలవు.
ఏంటి ఉపయోగం?: టార్డిగ్రేడ్‌లు అంతరిక్షంలో ఎలా మనుగడ సాగిస్తాయో అర్థం చేసుకోవడం వల్ల అంతరిక్ష కార్యకలాపాల్లో వ్యోమగాముల రక్షణకు కొత్త వ్యూహాలను అభివృద్ధి చేయవచ్చు. శుభాంశు అంతరిక్షంలో భారత జాతి టార్డిగ్రేడ్‌లపై అధ్యయనం చేసి, అవి ఎలా మనుగడ సాగిస్తాయో, పునరుత్పత్తి చేస్తాయో, సూక్ష్మ గురుత్వాకర్షణకు (మైక్రోగ్రావిటీ) ఎలా స్పందిస్తాయో, రోజులు గడుస్తున్నకొద్దీ వాటిలో వచ్చే మార్పులు (ఏజింగ్ ప్యాటర్న్) పరిశీలించారు. ఈ అధ్యయనం వల్ల రక్షణ వ్యూహాలే కాకుండా.. అంతరిక్షంలో ఆహారాన్ని, జీవ నమూనాలను ఎలా నిల్వ చేయవచ్చో తెలుస్తుంది.

**2 మయోజెనిసిస్**

ఏంటిది?: మయోజెనిసిస్ అంటే కండరాల్లోని కణాల అభివృద్ధి/పెరుగుదల. దీర్ఘకాలిక అంతరిక్ష యాత్రల సమయంలో వ్యోమగాముల కండరాల బరువు తగ్గుతుంటుంది. తద్వారా కండరాలు బలహీనమవుతాయి.
ఏంటి ఉపయోగం?: కండరాల్లో కణాలను సూక్ష్మ గురుత్వాకర్షణలో అధ్యయనం చేసి అవి ఎలా ప్రవర్తిస్తాయో, వాటిలో వచ్చే మార్పులేమిటో శుభాంశు నిశితంగా పరిశీలించారు. సూక్ష్మ గురుత్వాకర్షణలో కండరాల్లో కణాలు ఎలా ప్రవర్తిస్తాయో అర్థం చేసుకోవడం వల్ల వాటి బరువు తగ్గకుండా నివారణోపాయాలను కనిపెట్టటానికి, ఆరోగ్య పరిరక్షణకు ఈ అధ్యయనం తోడ్పడుతుంది.

**3 విత్తనాల పెరుగుదల**

ఏంటిది?: అంతరిక్షంలోకి శుభాంశు పెసర, మెంతి విత్తనాలు తీసుకెళ్లి ట్రేలలో వాటిని ఉంచారు.
ఏంటి ఉపయోగం?: సూక్ష్మ గురు త్వాకర్షణ ప్రభావం మొలకలపైనా, విత్తనాల పెరుగుదలపైనా ఎలా ఉంటుందో అధ్యయనం చేశారు. అంతరిక్షంలో మొక్కలను పెంచడం వల్ల దీర్ఘకాలిక మిషన్లలో వ్యోమగాము లకు స్థిరమైన ఆహార వనరు లభిస్తుంది.

**4 సైనోబ్యాక్టీరియా**

ఏంటివి?: సైనోబ్యాక్టీరియా అనేవి ఆక్సిజన్‌ను, పోష కాలను ఉత్పత్తి చేయగల సూక్ష్మజీ వులు. శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం భూమిపై మొట్టమొదట ప్రాణ వాయువును ఉత్పత్తి చేసిన జీవులు ఇవి.
ఏంటి ఉపయోగం?: సూక్ష్మ గురుత్వాకర్షణలో సైనో బ్యాక్టీరియా ఎలా పెరుగుతుందో అర్థం చేసుకోవడం ద్వారా అంతరిక్ష కార్యకలాపాల కోసం 'బయో రీజెనరేటివ్ లైఫ్ సపోర్ట్ వ్యవస్థ'లను అభివృద్ధి చేయవచ్చు. ఉన్న వనరులను రీ సైకిల్ చేసి ఆక్సిజన్, నీరు, ఆహారం వంటి వనరులను తయారు / ఉత్పత్తి చేయటం ద్వారా అంతరిక్షంలో మానవ మనుగడకు సహాయం చేసే కృత్రిమ వ్యవస్థలే ఈ బయో రీజెనరేటివ్ వ్యవస్థలు. ఇవి పర్యావరణ కాలుష్యాన్ని కూడా తగ్గిస్తాయి.

**5 మైక్రో అల్గే**

ఏంటివి?: మంచినీరు, సముద్ర పర్యావరణ వ్యవస్థలలో కీలక పాత్ర పోషించే సూక్ష్మ, ఏకకణ జల జీవులనే సూక్ష్మ శైవలాలు (మైక్రో ఆల్గే) అంటారు. ఇవి పోషకాలను అందించగల ఆహారంగా స్వీకరించతగిన సూక్ష్మజీవులు. అలాగే బొగ్గు వంటి శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయమైన బయో ఇంధనంగానూ ఉపయోగపడతాయి.
ఏంటి ఉపయోగం?: సూక్ష్మ గురుత్వాకర్షణలో సూక్ష్మ శైవలాలు ఎలా పెరుగుతాయో అర్థం చేసుకోవడం, వ్యోమగాములకు స్థిరమైన ఆహార వ్యవస్థలను అభివృద్ధి చేయటం ఈ అధ్యయన లక్ష్యం. అలాగే అంతరిక్షంలో ఇంధన సమస్యల పరిష్కారానికి కూడా ఇది దారి చూపుతుందని భావిస్తున్నారు.

**6 పంట విత్తనాలు**

ఏంటిది?: ఈ ప్రయోగం ఆహార పంటల విత్తనాలపై సూక్ష్మగురుత్వాకర్షణ ప్రభావాన్ని పరిశీలించింది.
ఏంటి ఉపయోగం?: శుభాంశు సూక్ష్మ గురుత్వాకర్షణ వాతావరణంలో పంట విత్తనాల పెరుగుదల, దిగుబడులపై అధ్యయనం చేశారు. దీర్ఘకాలిక అంతరిక్ష యాత్రలలో వ్యోమగాములకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించే విధానాలను తెలుసుకోవటానికి ఈ అధ్యయన ఫలితాలు ఉపకరిస్తాయి.

**7 వాయేజర్ డిస్‌ప్లేలు**

ఏంటివి?: కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు. ఈ ప్రయోగంతో ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు అంతరిక్షంలో ఎలా పనిచేస్తాయి, వాటి వాడకం వల్ల వ్యోమగాములపై ఎలాంటి ప్రభావం ఉంటుందో శుభాంశు విశ్లేషించారు.
ఏంటి ఉపయోగం?: సూక్ష్మ గురుత్వాకర్షణలో కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు వ్యోమగాముల కళ్లు, మెదడుపై ఎలాంటి ప్రభావం చూపుతాయి, ఎన్ని గంటల పాటు వాటిని వినియోగించవచ్చు, అంతరిక్ష అవసరాల కోసం ఎలాంటి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు కావాలి.. వంటి విషయాలు తెలుసుకునేందుకు ఈ ప్రయోగం తోడ్పడుతుంది.

## కోట్లలో మరణాలు.. యాక్టివ్‌లోనే ఆధార్ కార్డులు

**వాటిలో కేవలం 10 శాతం కార్డులను మాత్రమే డీయాక్టివేట్ చేస్తున్నట్టు వెల్లడి**

**ఢిల్లీ:** మన దేశంలో ఆధార్ కార్డుల విషయమై భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ సంచలన వ్యాఖ్యలు చేసింది. దేశంలో కోట్ల మంది చనిపోయినప్పటికీ వారి ఆధార్ కార్డులు యాక్టివ్‌గానే ఉన్నాయని ఉడాయ్ తెలిపింది. వాటిలో కేవలం 10 శాతం కార్డులను మాత్రమే డీయాక్టివేట్ చేస్తున్నట్టు వెల్లడించింది. దీని వల్ల ఆధార్ నంబర్లు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ కార్డుల విషయమై.. జాతీయ మీడియా 'ఇండియా టుడే' దాఖలు చేసిన సమాచార హక్కు దరఖాస్తు నేపథ్యంలో ఉడాయ్ సమాధానం ఇచ్చింది. ఈ క్రమంలో కీలక విషయాలను బయటపెట్టింది. ఈ సందర్భంగా ఉడాయ్.. దేశంలో గత 14 సంవత్సరాల్లో సుమారు 11.7 కోటి మంది మరణించినప్పటికీ కేవలం 1.15 కోట్ల ఆధార్ నంబర్లను మాత్రమే డీయాక్టివేట్ చేసిందని తెలిపింది. ఇది దేశ మరణాల రేటుతో పోలిస్తే చాలా తక్కువగా ఉంది. అయితే, సిటిజన్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్ఎస్) డేటా ప్రకారం.. 2007 నుంచి 2019 వరకు సంవత్సరానికి సగటున 83.5 లక్షల మరణాలు చోటుచేసుకుంటున్నాయి. అయినప్పటికీ 10 శాతం కార్డులను మాత్రమే డీయాక్టివేట్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ మరణ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యులు ఇచ్చే సమాచారం ఆధారంగా జరుగుతుందని ఉడాయ్ వెల్లడించింది. ఇదే సమయంలో గత ఐదు సంవత్సరాల్లో సంవత్సరం వారీగా ఎన్ని ఆధార్ నంబర్లు మరణాల ఆధారంగా డీయాక్టివేట్ చేయబడ్డాయని ఆర్టీఐ ద్వారా అడిగినప్పుడు.. అటువంటి సమాచారం తమ వద్ద లేదు

## వచ్చే నెలలో మోదీ చైనా పర్యటన!

న్యూఢిల్లీ

ప్రధాని మోదీ వచ్చే నెలలో చైనాలో పర్యటించబోతున్నారు. ఆగస్టు 31, సెప్టెంబర్ 1వ తేదీల్లో చైనాలోని తియాంజిన్ నగరంలో జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్సీఓ) సదస్సులో ప్రధాని మోదీ పాల్గొంటారని సమాచారం. 2020 జూన్‌లో జరిగిన భారత్, చైనా జవాన్ల భీకర ఘర్షణ తర్వాత మోదీ చైనాకు వెళ్తుండడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఆయన చివరిసారిగా 2019లో చైనాలో పర్యటించారు. గల్వాన్ లోయ ఘటన తర్వాత భారత్%–%చైనా ద్వైపాక్షిక సంబంధాలు క్షీణించాయి. సంబంధాలు పునరుద్ధరించుకోవాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. ఈ విషయంలో మోదీ చైనా పర్యటన కీలకమైన ముందడుగు అవుతుందని దౌత్య నిపుణులు అంచనా వేస్తున్నారు. మోదీ చైనా పర్యటన సందర్భంగా చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉంది. చైనాలో ఎస్సీఓ సదస్సు నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ సహా సభ్యదేశాల అధినేతలతో మోదీ భేటీ అవుతారు. చైనా పర్యటన కంటే ముందు ప్రధానమంత్రి జపాన్‌లో పర్యటిస్తారని సమాచారం. మోదీ ప్రధానమంత్రి హోదాలో ఇప్పటిదాకా ఐదు సార్లు చైనాలో పర్యటించారు. దేశ విదేశాల్లో షీ జిన్‌పింగ్‌తో 18 సార్లు సమావేశమయ్యారు. మరోవైపు భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ మంగళవారం చైనా అధినేత జిన్‌పింగ్‌తో భేటీ అయిన సంగతి తెలిసిందే. భారత్%–%చైనా సంబంధాలపై వారు చర్చించారు.

## ఆకాశ్ ప్రైమ్ పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ

భారత స్వదేశీ తయారీ గగనతల రక్షణ వ్యవస్థను మరింత పటిష్టంచేసేలా ఆకాశ్ ప్రైమ్ క్షిపణి పరీక్ష విజయవంతమైందని భారత రక్షణ శాఖ వర్గాలు బుధవారం ప్రకటించాయి. సముద్రమట్టానికి 15,000 అడుగుల ఎత్తులో లద్దాఖ్‌లో భూతలం నుంచి గగనతల లక్ష్యాలను ఛేదించే ఆకాశ్ ప్రైమ్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించామని రక్షణ వర్గాలు తెలిపాయి. క్షిపణిని అభివృద్ధి చేసిన రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) సహకారంతో లద్దాఖ్ సెక్టార్‌లో ఈ ప్రయోగపరీక్షలు పూర్తయ్యాయి. గగనంలో వేగంగా భిన్న దిశల్లో కదిలే రెండు లక్ష్యాలను ఆకాశ్ ప్రైమ్ మిస్సైల్ అత్యంత ఖచ్చితత్వంతో ఛేధించింది. అననుకూల వాతావరణంలోనూ పూర్తి సమర్థతతో పనిచేసి క్షిపణి తన సత్తా చాటింది. భారత సైన్యంలోని మూడో, నాలుగో ఆకాశ్ రెజిమెంట్‌లో ఈ కొత్త ఆకాశ్ ప్రైమ్ క్షిపణులను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఆపరేషన్ సిందూర్ వేళ పాకిస్తాన్ నుంచి దూసుకొచ్చిన డ్రోన్లు, క్షిపణులను ఆ ఆకాశ్ ప్రైమ్ క్షిపణి విజయవంతంగా అడ్డుకుని ఇప్పటికే తన సమర్థతను నిరూపించుకుంది. ఆనాడు పాకిస్తాన్‌కు చైనా తయారీ యుద్ధవిమానాలు, ఇజ్రాయెల్ సరఫరా చేసిన డ్రోన్ల నుంచి పొంచి ఉన్న ముప్పును ఆకాశ్ ప్రైమ్ క్షిపణులు తప్పించాయని రక్షణ వర్గాలు పేర్కొన్నాయి.

## ఈ నెల 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు



ఈ నెల 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ప్రభుత్వం ఎనిమిది కొత్త బిల్లులను పార్లమెంట్‌కు సమర్పించనున్నది. ఇందులో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు సంబంధించిన బిల్లు సైతం ఉన్నది. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రస్తుతం ఈ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను తొలగించే ఉద్దేశం కేంద్రానికి లేదని తెలుస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించిన విషయం తెలిసిందే. రాష్ట్రపతి పాలన కోసం ప్రభుత్వం ప్రతి ఆరునెలలకోసారి పార్లమెంట్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రపతి పాలన గడువు ఆగస్టు 13తో ముగియనున్నది. అలాగే పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వ మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (సవరణ) బిల్లు 2025, పబ్లిక్ ట్రస్ట్ (నిబంధనల సవరణ) బిల్లు 2025, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లు 2025, పన్ను చట్టాలు (సవరణ) బిల్లు 2025, జియో–హెరిటేజ్ సైట్స్ అండ్ జియో–రిమైన్లు (సంరక్షణ–నిర్వహణ) బిల్లు 2025, గనులు–క్వారీలు (అభివృద్ధి–నియంత్రణ) సవరణ బిల్లు 2025, జాతీయ క్రీడా పరిపాలన బిల్లు 2025, జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు 2025లను కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందాలని చూస్తున్నది. దాంతో పాటు గోవా రాష్ట్ర శాసనసభ నియోజకవర్గాల్లో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్వ్యవస్థీకరణ బిల్లు 2024, మర్చంట్ షిప్పింగ్ బిల్లు 2024, ఇండియన్ పోర్ట్స్ బిల్లు 2025, ఆదాయపు పన్ను బిల్లు 2025 కూడా లోక్‌సభలో ఆమోదం పొందే అవకాశాలున్నాయి. ఏప్రిల్ నెలలో ముగిసిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఉభయ సభల్లో కేంద్రం 16 బిల్లులను ఆమోదించాయి. బడ్జెట్ సమావేశాల్లో గందరగోళం నెలకొన్న విషయం తెలిసిందే, కానీ, జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) నివేదిక సమర్పించిన తర్వాత.. వక్ఫ్ (సవరణ) బిల్లు 2025 ఆమోదం పొందింది.

## బెంగాలీల పట్ల బీజేపీ వైఖరికి సిగ్గుపడుతున్నా

**కోల్‌కతా:** బెంగాలీల పట్ల బీజేపీ వైఖరికి తాను సిగ్గుపడుతున్నానని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే ప్రజలపై జరుగుతున్న వేధింపులకు వ్యతిరేకంగా బుధవారం కోల్‌కతాలో భారీ నిరసన ర్యాలీ జరిగింది. సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలో జరిగిన నిరసన ర్యాలీలో టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, ఆ పార్టీ సీనియర్ నేతలతోపాటు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, ఈ సందర్భంగా మమతా బెనర్జీ ప్రసంగించారు. బెంగాలీ మాట్లాడే వారందరినీ బంగ్లాదేశీ రోహింగ్యాలు అని బీజేపీ పిలుస్తున్నదని విమర్శించారు. రోహింగ్యాలు మయన్మార్‌లో నివసిస్తారని తెలిపారు. పశ్చిమ బెంగాల్ పౌరులందరికీ సరైన గుర్తింపు కార్డులు, గుర్తింపు ఉన్నాయని అన్నారు. 'బెంగాల్ బయటకు వెళ్లిన కార్మికులు స్వయంగా వెళ్లలేదు. వారికి నైపుణ్యాలు ఉన్నందున వారిని నియమించారు. బెంగాలీ మాట్లాడే వారిని అరెస్టు చేసి జైలులో పెడుతున్నారు. ఎందుకు? పశ్చిమ బెంగాల్ భారతదేశంలో భాగం కాదా?' అని ప్రశ్నించారు. బెంగాలీల పట్ల బీజేపీ వైఖరికి తాను సిగ్గుపడుతున్నానని అన్నారు. మరోవైపు ఆ రాష్ట్రంలోని జిల్లాల్లో కూడా టీఎంసీ ఆధ్వర్యంలో ఇలాంటి నిరసన కార్యక్రమాలు జరిగాయి. ప్రధాని మోదీ పశ్చిమ బెంగాల్ పర్యటనకు ఒక రోజు ముందు ఈ నిరసనలు జరుగడం ప్రాధాన్యత సంతరించుకున్నది. బెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

# మణికొండలో మంచినీటి సమస్యకు పరిష్కారం చూపాలి





## బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ నాయకులు సీతారాం ధూళిపాళ

గండిపేట్, : సూర్య ప్రతినిధి

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో మంచినీటి సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ మున్సిపాలిటీ నాయకులు సీతారాం ధూళిపాళ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు త్రాగునీరు గురించి పడుతున్న ఇబ్బందులకు తమవంతుగా జలమండలి కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు మంచినీటి సమస్యలు ఎదుర్కొంటున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలో వైఫల్యం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఫిబ్రవరి 6 న అలుకాపూర్, ఎల్ఐసీ కాలనీలలో ఉన్న రిజర్వాయర్ లను తూతూ మంత్రంగా మొదలు పెట్టారని, ఇప్పటి వరకు పనులు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద పెద్ద అపార్ట్మెంట్లకు కట్టడి లేని విధంగా నీటి సరఫరా ఇవ్వడం వలన సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ విషయమై సంబంధిత అధికారులు దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజల వద్ద ముక్కు పిండి బిల్లులు వసూలు చేస్తున్నారని, చట్ట పరిధిలో లేని వాల్యు ఛార్జీలు వసూలు చేస్తున్నారని, కానీ అందుకు ప్రతి ఫలంగా ఛార్జీ చేసిన మేర నీటిని విడుదల చేయడం లేదని ప్రతి ఇంటికి సమన్యాయంగా నీటిని సరఫరా చేయాలని అన్నారు. మున్సిపల్ చట్ట పరిధి ప్రకారం 240 గజాల ఇండ్లు, అపార్ట్మెంటు మాదిరి కట్టడాలకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ లు జారీ చేయవలసిన అవసరం లేదని, ఆ విషయమై తెలంగాణ రాష్ట్ర మునిసిపాలిటి అంతర్భాగమైన జలమండలి అధికారులకు ఎంత మాత్రం అధికారం లేదని, కానీ జలమండలి అధికారులు చట్టం మా చుట్టం అనుకొంటూ తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు. మునిసిపల్ పర్మిషన్ కు విరుద్ధముగా కట్టడం కట్టావని దృష్టికి తెస్తూ చట్టానికి తూట్లు పొడుస్తూ తమ ఇష్టానుసారం మెదులుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇబ్బడిముబ్బడిగా జలమండలి నీటి సరఫరాకు బిల్లులు వసూలు చేస్తున్నారని ప్రజలు తెలుపగా స్థానిక బి.ఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభగల్ల ధనరాజ్, ప్రధాన కార్యదర్శి గుట్టమీది నరేందర్, మహిళా అధ్యక్షురాలు పట్లోళ్ల రూపా రెడ్డి,బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి, లక్ష్మణ్ రావు అందే, రాజేంద్రప్రసాద్, సంగం శ్రీకాంత్, కిరణ్ యాలాల, బొడ్డు శ్రీధర్, బాబురావు, ఆరీఫ్ మొహమ్మద్, సుమ నళిని, భాను చందర్, మాల్యాద్రి నాయుడు, షేక్ ఆరీఫ్, అజయ్, చెరుకూరి బాలాజీ, నర్సింగ్ రావు, బెన్నీ, ఆశ్వక్ అలీ, అష్రఫ్, నరసింహ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయం





## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

గండిపేట్, : సూర్య ప్రతినిధి

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో అభివృద్ధే ప్రధాన ఎజెండాగా పని చేయడం జరుగుతుందని రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో రూ.71 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు, రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ బుధవారం పరిశీలించారు. పనుల పురోగతిని, నాణ్యతను స్వయంగా పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. సిసి రోడ్డు, రైల్వే బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మైలార్‌దేవ్ పల్లి నుంచి శాస్త్రిపురం, వట్టేపల్లి వెళ్లే ప్రజలకు ప్రయాణదూరం గణనీయంగా తగ్గుతుందన్నారు. ఇది నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమని, ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, ప్రజలకు సులువైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందించడమే తమ లక్ష్యమన్నారు. ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ వివరించారు. పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాస్, డిఈ కార్తీక్, రాజేంద్రనగర్ సర్కిల్ డిసి రవికుమార్, ఈఈ నరేందర్, డివిజన్ అధ్యక్షులు ధనుంజయ్, జీవన్ గౌడ్, కళ్లెం లక్ష్మారెడ్డి, యంజాల శేఖర్ నేత స్థానికులు ఉన్నారు.

## ఇబ్రహీంపట్నం డిపో నుండి వచ్చే అన్ని బస్సులు

# తుర్కయంజాల్ కట్టమైసమ్మ దగ్గర ఆపాలి

### తుర్కయంజాల్ సిపిఎం నాయకులు మండల సత్యనారాయణ

తుర్కయంజాల్,జూలై 16, ప్రభాత సూర్య:

తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని 22 23 24 వార్డులో ఉండే సుందరయ్య కాలనీ,లక్ష్మీ నగర్, ఇందిరమ్మ కాలనీ, సాయినాథ్ కాలనీ, శ్రీరంగాపురం, శ్రీ శ్రీనివాస్ కాలనీ, ఆపిల్ రెవెన్యూ, బొక్క నారాయణరెడ్డి కాలనీ, సాయి ప్రియ కాలనీలు తుర్కయంజాల్ కట్టకింద ఉన్నాయి. ఈ యొక్క కాలనీలకు బస్టాండ్ తుర్కయంజాల్ కట్ట మైసమ్మ గుడి దగ్గర ఉన్నది గత రెండు మూడు నెలల కాలం నుండి ఆర్టీసీ బస్సులు సరిగా ఆపడం లేదు మార్నింగ్ నాలుగు గంటల నుండి పనుల కోసం పేదలు రోడ్డుపైన బస్సులు ఎక్కడానికి వస్తుంటారు.సరిగా ఆపకపోవడంతో విద్యార్థులు మహిళలు కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. బస్సులను ఆపాలని ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ కి సిపిఎం పార్టీ సుందరయ్య నగర్ కాలనీ శాఖల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిపిఎం తుర్కయంజాల్ బాధ్యులు మండల సత్యనారాయణ, సుందరయ్య నగర్ శాఖల కన్వీనర్ పోడేండ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ తుర్కయంజాల్ కట్ట కింద ఉన్న 10 కాలనీల ప్రజలు ప్రధానంగా నాలుగు వీకర్ సెక్షన్ కాలనీలు ఉన్నాయి ఈ కాలనీలో ప్రజలు బస్సులకు ప్రయాణం తప్ప మరో మార్గం లేదు సాగర్ హైవేలో ఉన్న బస్టాండ్లో బస్సు ఆపకపోవడం సోషనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులు అదేవిధంగా హైదరాబాద్ నుంచి ఇబ్రహీంపట్నం వెళ్లే బస్సులు కట్ట మైసమ్మ టెంపుల్ దగ్గర ఆపాలని డిమాండ్ చేశారు.లేనియెడల కాలనీలో ఉండే ప్రజలను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ యొక్క కార్యక్రమంలో సుందరయ్య నగర్ సిపిఎం శాఖ కార్యదర్శి ఐతరాజు కృష్ణ, నాయకులు బి శంకరయ్య,కే కుమార్,కే సత్యం,జి సాయి,ఎం నరసింహ,జి బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



## అన్నమయ్య జిల్లా మహిళల అద్భుతాలు

**కడప :** అన్నమయ్య జిల్లా మహిళలు రసాయన ఎరువులకు దూరంగా ప్రకృతి వ్యవసాయంతో ఆదర్శంగా నిలుస్తున్నారు. పొదుపు సంఘాలతో కలిసి చిరుధాన్యాల తినుబండారాలు తయారు చేసి విక్రయిస్తూ లక్షలు సంపాదిస్తున్నారు. కూరగాయలు, ఆకుకూరలు పండిస్తూ, రాగి లడ్డూలు, కొర్ర పాయసం వంటి వాటిని మండల కేంద్రాల్లో అమ్ముతున్నారు. వారానికి రూ.14 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం పొందుతూ, కుటుంబానికి లక్ష నుంచి రెండు లక్షల వరకు సంపాదిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. రసాయన ఎరువుల కారణంగా పంటలు విషపూరితం అవుతున్నాయి. ఈ క్రమంలో ప్రకృతి వ్యవసాయం వైపు ఎంతోమంది రైతులు మొగ్గు చూపుతున్నారు. అన్నదాతలు మాత్రమే కాదు.. అన్నమయ్య జిల్లాలోని మహిళలు పొదుపు సంఘాలతో పాటు ప్రకృతి వ్యవసాయం కూడా చేస్తున్నారు. చిరుధాన్యాలతో తినుబండారాలు తయారు చేసి అమ్ముతున్నారు.. తద్వారా లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్నారు.. లాభాలు కూడా పొందుతున్నారు.అన్నమయ్య జిల్లా అయ్యవారిపల్లె, చింతలవారిపల్లె, చింతపర్తి, నగిరి మడుగ, బూడిద వేడుకు చెందిన 15 మంది మహిళలు కలిసి ఒక సంఘంగా ఏర్పడ్డారు. వారికి అందుబాటులో ఉన్న తక్కువ విస్తీర్ణంలోనే ఏకంగా ఏడు రకాల కూరగాయలు, ఆకుకూరలు నేచరల్‌గా పండిస్తున్నారు. అంతేకాదు చిరుధాన్యాలతో తినుబండారాలు తయారు చేస్తున్నారు.. వీటిలో రాగి లడ్డూలు, కొర్ర పాయసం, సద్ద మురుకులు వంటివి ఉన్నయాయి. ఇలా పండించిన కూరగాయలు, ఆకుకూరలు.. తయారు చేసిన తినుబండారాలను తీసుకెళ్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల దగ్గర విక్రయిస్తున్నారు.. ప్రతి సోమవారం అమ్మకాలు జరుగుతున్నాయి.ఇలా ప్రతి సోమవారం ఒక్క రోజులోనే దాదాపు 4 నుంచి 5 క్వింటాళ్ల కూరగాయలు అమ్ముతు సక్సెస్ అయ్యారు. ఇలా వీరు రూ. 14వేల నుంచి రూ. 20వేల వరకు ఆదాయం సంపాదిస్తున్నారు. ఏడాది పొడవునా దిగుబడి వస్తూనే ఉంటుందని మహిళా రైతులు చెబుతున్నారు. ఇలా తమ సంఘంలో ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ. లక్ష నుంచి రూ. రెండు లక్షల వరకు ఆదాయం వస్తుంది అంటున్నారు.

## బోనాల ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ప్రేమావతిపేట్ గోడను తొలగింపజేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



గండిపేట్, : సూర్య ప్రతినిధి

బోనాల ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ప్రేమావతిపేట్ పరిధిలో రాకపోకలు సాగించేందుకు అడ్డుగా ఉన్న గోడను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థుల విన్నపంతో యూనివర్సిటీ అధికారులతో మాట్లాడటం జరిగిందన్నారు. బోనాల పండగకు రాకపోకలు కొనసాగించాడానికి అడ్డుగా నిర్మించిన గోడను తొలగింపజేసినట్లు వివరించారు. బోనాల పండగకు ఆడపడుచులు బోనం ఎత్తుకొని పోవుటకు అడ్డుగా నిర్మించిన గోడను తొలగింపజేసినట్లు తెలిపారు. ఈ సమస్యను సానుకూలంగా పరిష్కరించడానికి సహకారం అందించిన యూనివర్సిటీ విసి జానయ్య, రిజిస్ట్రార్ విద్యాసాగర్ లకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ జై రామ్ సంఘం ప్రేమావతిపేట్ గ్రామ అధ్యక్షులు గోల్కొండ రాజు కుమార్, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం, కార్యవర్గ సభ్యులు లేవి రాజ్,చంద్ర శేకర్,ఆగపల్లి నర్సింహా,సుమన్,సుభాష్,ఉపేందర్,మైలర్ దేవ్ పల్లి అధ్యక్షులు నత్తి ధనుంజయ్,అనిల్ కుమార్,గౌతమ్,నవీన్,కె. కృష్ణ,రవి,దేవేందర్,అక్షయ్, సురేందర్, డి.సన్నీ, డి.కృష్ణ,బాబు, శ్రీను, రాజు, గడ్డం సతయ్య, జనార్దన్, హరీష్, సునీల్, కుమార్, నరహరి, నాని తదితరులు ఉన్నారు.

## ప్రయాణికుల సౌకర్యార్థం ఆటోవాలాలు సహకరించాలి

### నార్సింగి ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి





గండిపేట్, : సూర్య ప్రతినిధి

నార్సింగి ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో ప్రయాణికుల సౌకర్యార్థం ఆటోవాలాలు సహకరించాలని నార్సింగి ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మై ఆటో ఈస్ సేఫ్ యాప్ ను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, స్టిక్కర్‌ను అతికించుకోవాలని సూచించారు. బుధవారం పోలీసుస్టేషన్ పరిధిలోని 410 ఆటోలను గుర్తించి వారికి మై ఆటో ఈస్ సేఫ్ అనే అప్లికేషన్ లో డిటెయిల్స్ రికార్డు చేసి వారి ఆటోకు పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లడుతూ.. పోలీసుస్టేషన్ పరిధిలో నడుస్తున్న ఆటోలకు మై ఆటో ఈస్ సేఫ్ అనే పోస్టర్స్ ను అతికించాలన్నారు. ప్రయాణికుల ప్రయాణానికి భద్రత కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. మై ఆటో ఈజ్ సేఫ్ అనే అప్లికేషన్లో వారి డీటెయిల్స్ రికార్డు చేసి వారి ఆటోకు పోస్టర్స్ ను మంజూరు చేసి ప్రతి ఒక్క ఆటోకు అతికించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వావిళ్ళపల్లి లో ఘనంగా కోమటిరెడ్డి సంకీర్త్ రెడ్డి జన్మదిన వేడుకలు






సంస్థాన్ నారాయణపురం, జూలై 16( ప్రభాత సూర్య ):

మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనయుడు సుశీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ %ఁ% డెవలపర్ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండి కోమటిరెడ్డి సంకీర్త్ రెడ్డి జన్మదినాన్ని సంస్థాన్ నారాయణపురం మండల వావిళ్ళపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జక్కర్తి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు జక్కర్తి సత్తయ్య, శ్రీరాముల మైసయ్య, మాజీ వార్డు మెంబర్ ఆత్కూరు పెంటయ్య, నెల్లికంటి శంకర్, మొత్తం గుండెపంగా స్వామి, ఆందోజు బ్రహ్మాచారి, ఐతరాజు పెద్ద మల్లయ్య,వల్లపోజు విష్ణు, గణేష్, దోటి రాజు, యువ నాయకులు వావిళ్ళ నాగరాజు, పర్సనబోయిన మల్లికార్జున, జక్కర్తి పరమేష్, దుబ్బాక ప్రవీణ్, వంగూరి రామకృష్ణ, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సమగ్ర అభివృద్ధికి బలమైన ఉద్యమాలు

**జిల్లాలో పెండింగ్ సాగు నీటి ప్రాజెక్టులు.. నిర్ణీత కాలవ్యవధిలోనే పూర్తిచేయాలి**

**సిపిఐ నూతన జిల్లా కార్యదర్శి, నెల్లికంటి సత్యం**




నల్గొండ జూలై 16 ప్రభాత సూర్య

నల్లగొండ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం బలమైన ఉద్యమాలు నిర్వహిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి, %మీజ% నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. బుధవారం సిపిఐ నల్లగొండ జిల్లా కార్యాలయం ముక్దూం భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మహాసభ వివరాలు వెల్లడించారు.. సిపిఐ నల్లగొండ జిల్లా 23వ మహాసభ దేవరకొండ పట్టణంలో ఈనెల 15వ తేదీ మంగళవారం విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు మహాసభలో జిల్లా కార్యదర్శి గా నెల్లికంటి సత్యం, సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్ లతోపాటు 45మంది కౌన్సిల్ సభ్యులు, 13మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. నల్లగొండ జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టు లను పూర్తి చేయడానికి నిర్ణీత కాలవ్యవధిని ప్రకటించి అందుకు సరిపడా అధిక నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాని కోరారు. కరువు పీడిత ప్రాంతాలైన మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలను సస్యశ్యామలం చేయడం కోసం ఆనాడు కేసి ఆర్ డిండి ఎత్తిపోతల పథకానికి హడావుడిగా శంకుస్థాపన చేశారు తప్ప, ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించకుండా ప్రాజెక్టు డిపిఆర్ ఆమోదించకుండా, ప్రాజెక్టుకు ఎక్కడినుండి నీరు తెస్తారో దానిపై స్పష్టత లేకుండా చేశారని ఆరోపించారు తెలంగాణ కు తీవ్ర అన్యాయం చేసి నీటిని తరలించుకుపోయేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మించడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బనకచర్ల ప్రాజెక్టును సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ కరువు పీడిత సమ స్యలతో అనేక ఇబ్బందులు పడ్డ ప్రజలకు ఇప్పుడు ఫార్మా కంపెనీల ద్వారా కాలుష్యంతో అనారోగ్యలాకు గురై ప్రాణాలను ప్రనంగా పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మునుగోడు ప్రాంతంలోని కిష్టాపురం గట్టుప్పల చిట్యాల మండలంలోని వెలిమినేడు, పిట్టంపల్లి ప్రాంతాలలో విచ్చలవిడిగా ఫార్మ కంపెనీ నెలకొల్పేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని వాటిని తీవ్రంగా వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. చౌటుప్పల్ ప్రాంతంలోని దివిస్ ఇలాంటి కెమికల్ కంపెనీ ద్వారా వెలువడే కాలుష్యం తో ఆ ప్రాంతం ప్రజలు తీవ్రమైన అనారోగ్యాలకు గురవుతున్నారని ఆ ప్రాంతంలో ఎక్కడ బోర్ వేసిన కెమికల్ ఆయిల్ తో కూడిన రంగు మారిన కెమికల్ నీరే వస్తుందని పేర్కొన్నారు. అలాంటి దివిస్ కంపెనీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు చేపడతామన్నారు. నల్గొండ జిల్లా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నదని ప్రస్తుత పరిస్థితులలో రైతులు ఆయిల్ ఫామ్ పంటల సాగుకు మొగు చూపుతున్న నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాలో ఆయిల్ ఫామ్ పరిశ్రమలను నెలకొల్పాన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థ ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు,ఎస్ సి వర్గీకరణ లాంటి అంశాలను సిపిఐ స్వాగతిస్తుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బీసీల మీద చిత్తశుద్ధి ఉంటే వెంటనే తమిళనాడు రాష్ట్రం తరహాలో 42 శాతం రిజర్వేషన్ లను తొమ్మిదో షెడ్యూల్లో చేర్చి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి,లోడంగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, బొల్గురి నర్సింహా, గురిజ రామచంద్రం, నల్ప రాజు రామలింగయ్య,టి వెంకటేశ్వర్లు,ప్రజ్యానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమిద్ద శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి కె ఎస్ రెడ్డి లు పాల్గొన్నారు.

# కమీషన్లు రావనే విద్యార్థుల స్కాలర్షిప్ బకాయిలు చెల్లించడం లేదు ప్రభుత్వం

**8వేల కోట్ల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి**

**బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ -పల్లగొర్ల మోదీరాందేవ్**



భువనగిరి, జూలై 16( ప్రభాత సూర్య):

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ కేంద్రంలో ఆర్అండ్ బి గెస్ట్ హౌస్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది విద్యార్థుల ఫీజు రీయంబర్స్మెంట్ చెల్లిస్తే కమీషన్లు రావని.. అదే కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లిస్తే 20% నుంచి 30 %శాతం కమీషన్లు వస్తాయని.. అందుకే 30 లక్షల నిరుపేద విద్యార్థులకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లించడం లేదని సామాజికవేత్త బట్టు రామచంద్రయ్య, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్ ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీయంబర్స్మెంట్ స్కీమ్ను ఎత్తేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమని,ఆర్ కృష్ణన్న అమర నిరాహార దీక్ష చేసి పేద వర్గాల కోసం అప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒప్పించి స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని పెట్టించాడు యధావిధిగా ఈ పథకాన్ని కొనసాగించాలి చాలాకాలంగా పెండింగ్లో ఉన్న రూ. 8వేల కోట్ల ఫీజు రీయెంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఒకవైపు ఫీజు బకాయిలు చెల్లించకుండా మరోవైపు ఫీజుల స్కీములను ఎత్తేయడానికి ట్రస్ట్ బ్యాంకును ఏర్పాటు చేసి, దాని ద్వారా ఫీజులు చెల్లిస్తామన్న కొత్త నాటకంకు తెర లేపారని ఆరోపించారు. ఈ ప్రతిపాదన ఎట్టి పరిస్థితు ల్లోనూ అంగీకరించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. బకాయిలు చెల్లించక బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు ఇబ్బందులు పడు తున్నారని.. ఉన్నత చదువులు మానేసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుసున్నా కనీసం రూ. 20 రూపాయలు కూడా విద్యార్థులకు చెల్లించలేదన్నారు. పక్క రాష్ట్రమైన ఏపీలో ఇప్పటికే రెండు దఫా లుగా రూ. 1,500 కోట్లు విడుదల చేశారని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ కాలేజీ హాస్టళ్లలో సీట్లు లభించక విద్యార్థులు రైల్వేస్టేషన్, బస్టాం డ్లలో స్నానాలు చేస్తూ రాత్రివేళ అక్కడే పడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కొత్తగా రాష్ట్రంలో 100 బీసీ కాలేజీ హాస్టళ్లను మంజూరు చేయాలని, ప్రస్తుతం ఉన్న హాస ళ్లలో 20 శాతం సీట్లు పెంచాలని కోరారు. ఈ సమావేశంలో సామాజికవేత ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు బట్టు రామచంద్రయ్య, బైరి దీపక్ గౌడ్, శివ, ఆకుల భువనేశ్వర్, గూడూరు నిఖిల్, మట్ట జస్వంత్, వెంకట్, సాయినాథ్, కౌశిక్, మల్లేష్, గణేష్, కళ్యాణ్, కార్తీక్, శ్రవణ్, శేఖర్, గణేష్, తదితరులు పాల్గొన్నారు

# పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలి

**బి చౌటుప్పల్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి**

**బిఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు**



చౌటుప్పల్. జులై 16. ప్రభాత సూర్య

విద్యారంగంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని,పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని స్కాలర్షిప్ లతో సంబంధం లేకుండా సర్టిఫికెట్లు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు అన్నారు.బుధవారం చౌటుప్పల్ పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో స్వాగతం సభలు నిర్వహించి,కళాశాల కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థుల సమస్యలపై మాట్లాడుతూ.. చౌటుప్పల్లో డిగ్రీ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలిందని, వెంటనే చౌటుప్పల్ లో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రంలో గత ఆరేళ్ల నుండి పెండింగ్లో ఉన్న 8150 కోట్ల పైగా స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలని అన్నారు. ప్రైవేట్ కళాశాలలో విద్యార్థులు నుండి పెండింగ్ ఫీజులను బలవంతంగా వసూళ్లు చేస్తున్నారన్నారు. అధికారంలోకి వస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బకాయిలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేసింద న్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు పై చదువులకు వెళ్ళాలంటే సర్టిఫికేట్స్ కోసం కాలేజీలు చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చౌటుప్పల్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తీగుళ్ల శ్రీనివాస్,జిల్లా కమిటీ సభ్యులు శ్రావణ్, మండల ఉపాధ్యక్షులు వరుణ్,మండల కమిటీ సభ్యులు కిషోర్,సృజన, నూతన కళాశాల కమిటీ అధ్యక్షు లుగా, కార్యదర్శులుగా మాధురి,సృజన,శ్రీవాణి, కృష్ణ,నూతన బాయ్స్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పవన్ అఖిల్ పాల్గొన్నారు.

## నారాయణ స్కూల్లో ఘనంగా ఇన్వెస్టిటర్ సెర్మోని



**నల్గొండ జూలై 16 ప్రభాత సూర్య** నల్గొండ జిల్లా కేంద్రం లోని హైదరాబాద్ రోడ్డులో గల నారాయణ స్కూల్ లో ఏర్పాటుచేసిన ఇన్వెస్టిటర్ సెర్మోని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెండో పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ సైదులు పాల్గొని మాట్లాడారు విద్యార్థులు చిన్న వయసులోనే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి అని నేటి బాలలే రేపటి దేశానికి దిక్సూచి అని . తమ తమ లక్ష్యాలను పాఠశాల నుంచి నిర్ధారించుకోవాలని తెలిపారు. ఏజీఎం శ్రీనివాస్ రెడ్డీ, ప్రిన్సిపల్స్ దివ్యా రెడ్డి , సైదులు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తరుణ్ రెడ్డి, ఉపాధ్యాయులు , విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం దిష్టిబొమ్మ దగ్ధం.

**జగదీష్ రెడ్డికి తక్షణమే క్షమాపణ చెప్పాలి**

**బి.ఆర్.ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్**



నల్గొండ జూలై 16 ప్రభాత సూర్య

నల్గొండ జిల్లా కేంద్రంలో నాగార్జున కళాశాల ముందు బి.ఆర్.ఎస్వి అద్వర్యంలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు తదనంతరం బి.ఆర్.ఎస్వి ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్ కట్టా శ్రీనివాస్ మాట్లాడుతు తిర్మలగిరి సభలో సీఎం రేవంత్ రెడ్డి జగదీష్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసారని సిగ్గు వుంటే 50 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో నల్గొండలో జరిగిన అభివృద్ధి, బిఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో జరిగిన అభివృద్ధి గురించి ఆత్మవిమర్శ చేసుకోవాలి అని అన్నారు చెప్పుకోవాడానికి చెసిన అబివృద్ధి ఏమి లేకనే ప్రజలను మబ్యపెట్టడానికే జగదీష్ రెడ్డి పై విమర్శలు చేసారని జగదీష్ రెడ్డి మీధ మొరగడం ఆపి అబివృద్ధి పై శ్రద్ధ పెట్టాలని విమర్శించారు. ఈ కార్యక్రమములో బి.ఆర్.ఎస్వి పట్టణ అధ్యక్షుడు అంబటి ప్రణీత్, కత్తుల జై చందన్, జెట్టి శివప్రసాద్, నాగార్జున కళాశాల అధ్యక్షుడు బాలాజీ నాయక్, వెంకటేష్, సాయి, రాము,వెంకన్న,రాజు తదితరులు పాల్గొన్నారు .

## ముత్యాలమ్మ దేవాలయం హుండీ లెక్కింపు



చౌటుప్పల్. జులై 16. ప్రభాత సూర్య:

చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని 14 వ వార్డులో ఉన్న శ్రీ ముత్యాలమ్మ దేవాలయం హుండీని దేవాలయ అధ్యక్షులు సందగళ్ల సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం టి లింగస్వామి, సిహెచ్ శివ నాగరాజు, సాయి ప్రణయ్, లక్ష్మమ్మ, కమలమ్మ భక్తులతో కలిసి లెక్కించారు. మొత్తం 79,896 రూపాయలు హుండీ ద్వారా ఆదాయం వచ్చినట్లు దేవాలయ అధ్యక్షులు సందగళ్ల సతీష్ గౌడ్ తెలిపారు.

## మర్రిగూడ ఆదర్శ పాఠశాలలు తనిఖీ చేసిన ఆర్డీవో

మర్రిగూడ ప్రభాత సూర్య



మర్రిగూడ మండలంలోని ఆదర్శ పాఠశాలను చండూరు ఆర్డీవో శ్రీదేవి ఎంపీడీవో మునయ్యతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు, హాస్టల్ వంట గది, బాత్రూములను పరిశీలించారు ఆమె వర్షాకాలం సీజన్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచించారు, విద్యార్థుల ఆహార నాణ్యత పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాల ప్రిన్సిపల్ సరూప రాణి, ఎస్ ఓ జ్యోతికి ఆదేశించారు, డిప్యూటీ తాసిల్దార్ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శీను నాయక్ పాల్గొన్నారు

## శ్రీయుత జిల్లా కలెక్టర్ , నల్లగొండ గారి స్పష్టయమైన హామీతో ఆందోళన విరమణ

మర్రిగూడ: ప్రభాత సూర్య:



మరిగూడ మండలంలోనిచెర్లగూడెం గ్రామస్తులకు ప్యాకేజి కింద రావలసిన ఇండ్ల స్థలాలకు చింతపల్లి మండలం లోని వర్కాల గ్రామంలో భూమి ని గుర్తించ నైనదని మరియు దీనికి సంబంధించిన భూ సేకరణ ప్రక్రియ 10 రోజులలో ప్రారంభిస్తామని కలెక్టర్ గారి తరుపున గారలు గ్రామస్తులకు ఇచ్చిన హామీతో వారి ఆందోళన విరమించారు

# విద్యార్థులు యూపీఎస్సీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలి

**విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు**
**విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పారితోషికం,స్టడీ మెటీరియల్ అందజేత**
**పాలకుర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ సేవలు అభినందనీయం...**
**ఫౌండేషన్ చైర్మన్ పాలకుర్ల మురళి.. ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ సరస్వతి**







చౌటుప్పల్.జూలై16. ప్రభాత సూర్య

విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందని, విద్యార్థులు యూనియన్ పబ్లిక్ సర్వీస్ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని పాలకుర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ చైర్మన్ పాలకుర్ల మురళి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పురపాలక కేంద్రం, లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాలలో పాలకూర్ల శివయ్య గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ పరీక్షల పైన అవగాహన కార్యక్రమాన్ని ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భం గా ఫౌండేషన్ చైర్మన్ పాలకుర్ల మురళి మాట్లాడుతూ.. జ్ఞాన వికాసానికి పుస్తక పఠనం మేలు చేస్తుందని అన్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష విధానంలో ఉన్న మౌలిక అంశాల స్వరూపాన్ని విద్యార్థులకు తెలియపరిచారు. యూపీఎస్సీ చదవాలని ఆకాంక్ష ఉన్న విద్యార్థులకు తమ ఫౌండేషన్ చేయూతనందిస్తుందని విద్యార్థులకు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు యూపీఎస్సీ పరీక్షలపై అవగాహన కలిగించి వారిని ఆ దిశగా ఎదిగే విధంగా పాలకుర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ కృషి చేస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు మీకు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేయకుండా చదువుపై ధ్యాస ఉంచి తల్లిదండ్రులకు ఉత్తమ ఫలితాలను బహుమతిగా అందజేసి వారిని సంతోషపెట్టాలని అన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా ఎంతో మంది విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష విధానములు చాలామందికి తెలియక అది తాము సాధించలేము అనే భావనతో వెనకడుగు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇష్టంతో కష్టపడి చదివితే సులువుగా చేరుకోవచ్చునని విద్యార్థులకు తెలిపారు. యూపీఎస్సీ స్టడీ మెటీరియల్, మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను ప్రిన్సిపల్ సరస్వతి చేతుల మీదుగా ఆయన విద్యార్థులకు అందజేశారు.యూపీఎస్సీ కి సంబంధించిన మరికొంత స్టడీ మెటీరియల్ ను పాఠశాల గ్రంథాలయానికి త్వరలో అందజేస్తానని తెలిపారు.

**యూపీఎస్సీ స్టడీ మెటీరియల్ ను సద్వినియోగం చేసుకోవాలి: ప్రిన్సిపాల్ సరస్వతి**

పాలకుర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని,వారు అందించిన యూపీఎస్సీ స్టడీ మెటీరియల్ ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఈ స్టడీ మెటీరియల్ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఎంతోమంది చదువుకున్న యువత నేడు గ్రామీణ ప్రాంతాల నుండి ఐఏఎస్,ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలను సాధిస్తున్నారని గుర్తు చేశారు.లక్ష్మీ కొందరిదని సరస్వతి అందరిదని విద్యార్థులకు తెలిపారు. పాఠశాలలోని వసతులను సద్వినియోగం చేసుకొని విద్యలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు.

**ప్రతిభ విద్యార్థులకు నగదు బహుమతి అందజేత...**

ఆదర్శ పాఠశాలలో 6,7, 8,9,10, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు పాలకుర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ చైర్మన్ పాలకూర్ల మురళి విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతిని వారి చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. యూపీఎస్సీ చదవడానికి తాము ఆసక్తి కనబరుస్తున్నట్లు వారికి తెలిపారు. యూపీఎస్సీ చదవడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులకు తమ ఫౌండేషన్ తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని చైర్మన్ మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకుర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ చైర్మన్ పాలకుర్ల మురళి, ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ సరస్వతి, ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, వెంకటరమణ, పూర్ణిమ, ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# కమీషన్లు రావనే విద్యార్థుల స్కాలర్షిప్ బకాయిలు చెల్లించడం లేదు

**-8వేల కోట్ల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి..**
**బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్**

చౌటుప్పల్. జులై 16. ప్రభాత సూర్య



ఫీజు రియంబర్స్మెంట్ స్కీమును ఎత్తివేసేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఎట్టి పరిస్థితులను అంగీకరించమని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీ రాందేవ్ యాదవ్ అన్నారు. బుధవారం భువనగిరి పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో సామాజికవేత్త బట్టు రామచంద్రయ్య తో కలిసి ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రీయంబర్స్మెంట్ చెల్లిస్తే కమీషన్లు రావని.. అదే కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లిస్తే 20% నుంచి 30 %శాతం కమీషన్లు వస్తాయని.. అందుకే 30 లక్షల నిరుపేద విద్యార్థులకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లించడం లేదని సామాజికవేత్త బట్టు రామచంద్రయ్య, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్ లు ఆరోపించారు. రీయంబర్స్మెంట్ స్కీమ్ను ఎత్తేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమని అన్నారు.ఆర్ కృష్ణన్న అమర నిరాహార దీక్ష చేసి పేద వర్గాల కోసం అప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒప్పించి స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని పెట్టించాడని గుర్తు చేశారు.యధావిధిగా ఈ పథకాన్ని కొనసాగించాలన్నారు. చాలాకాలంగా పెండింగ్లో ఉన్న రూ.8వేల కోట్ల ఫీజు రీయెంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఒకవైపు ఫీజు బకాయిలు చెల్లించకుండా మరోవైపు ఫీజుల స్కీములను ఎత్తేయడానికి ట్రస్ట్ బ్యాంకును ఏర్పాటు చేసి, దాని ద్వారా ఫీజులు చెల్లిస్తామన్న కొత్త నాటకంకు తెర లేపారని ఆరోపించారు. ఈ ప్రతిపాదన ఎట్టి పరిస్థితు ల్లోనూ అంగీకరించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. బకాయిలు చెల్లించక బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని,ఉన్నత చదువులు మానేసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుసున్నా కనీసం రూ.20 రూపాయలు కూడా విద్యార్థులకు చెల్లించలేదన్నారు. పక్క రాష్ట్రమైన ఏపీలో ఇప్పటికే రెండు దఫాలుగా రూ.1,500 కోట్లు విడుదల చేశారని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ కాలేజీ హాస్టళ్లలో సీట్లు లభించక విద్యార్థులు రైల్వేస్టేషన్, బస్టాండ్లలో స్నానాలు చేస్తూ రాత్రివేళ అక్కడే పడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కొత్తగా రాష్ట్రంలో 100 బీసీ కాలేజీ హాస్టళ్లను మంజూరు చేయాలని, ప్రస్తుతం ఉన్న హాస ళ్లలో 20 శాతం సీట్లు పెంచాలని కోరారు. ఈ సమావేశంలో సామాజికవేత ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు బట్టు రామచంద్రయ్య, బైరి దీపక్ గౌడ్, శివ, ఆకుల భువనేశ్వర్, గూడూరు నిఖిల్, మట్ట జస్వంత్, వెంకట్, సాయినాథ్, కౌశిక్, మల్లేష్, గణేష్, కళ్యాణ్, కార్తీక్, శ్రవణ్, శేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ దురుద్దేశంతో రేవంత్ రెడ్డి అబద్ధపు మాటలు

**నల్గొండ జూలై 16 ప్రభాత సూర్య** తుంగతుర్తి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ మీద రాజకీయ దురుద్దేశంతో మాట్లాడారని బిఆర్ఎస్ నల్గొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్, మాజీ శాసనసభలు కంచర్ల భూపాల్ రెడ్డి మరియు బండ నరేందర్ రెడ్డి లు అన్నారు బుధవారం జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పిసిసి అధ్యక్షులుగా ఉన్నప్పుడు పనికిమాలిన మాటలతో అధికారంలోకి వచ్చారని సీఎం అయినా ఇంకా భాష మారకపోవడం దారుణం అన్నారు. కెసిఆర్ కేటీఆర్ మాజీ మంత్రి జగదీష్ రెడ్డి లపై అవాకులు చవాకులు మాట్లాడడం తగదని హెచ్చరించారు. సీఎం వస్తుందంటే ఏదో అభివృద్ధి పథకాలు వస్తాయని ప్రజలు భావిస్తారు కానీ వ్యక్తిగత ఆరోపణలతో సీఎం సాయి దిగజారి



మాట్లాడాలి అని పేర్కొన్నారు రేషన్ కార్డ్స్ ప్రక్రియ నిరంతరంగా జరిగేదేనని చెప్పారు. ప్రభుత్వ సొమ్ముతో ప్రజలను మహిళా సంఘాల మహిళలను బలవంతంగా సభకు తీసుకొచ్చారని ఆరోపించారు టిఆర్ఎస్ 6.47 లక్షల రేషన్ కార్డ్స్ ఇచ్చిందని గుర్తు చేశారు. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ మీద ఎన్నో మాటలు చెప్పారు 19 నెలల్లో బీసీల కోసం ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు బీసీ కమిషన్ ఏర్పాటు చేసి దాని రిపోర్ట్ ఎందుకు బయట పెట్టలేదని విమర్శించారు. మీ చీకటి ఒప్పందాల కోసం మోడీని కలుస్తారు కానీ బీసీ రిజర్వేషన్ గురించి ఎందుకు అడగడం లేదన్న కేవలం స్థానిక సంస్థల్లో బీసీల ఓట్ల కోసమే ఆర్డినెన్స్ ఒక డ్రామా అని అన్నారు. ఆరు, ఏడు ఫీట్ల పొడవున్న మీ కాంగ్రెస్ నేతలు జిల్లాకి చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేశారని మూడు మెడికల్ కాలేజీలు సాగర్ చివరి భూములకు సాగునీరు, థర్మల్ పవర్ ప్రాజెక్టులు, వేల కోట్ల అభివృద్ధి పనులు తెచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రేగట్ట మల్లికార్జున్ రెడ్డి, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, సత్తయ్య గౌడ్ పంకజ్ యాదవ్, ప్రసన్న రాజు తదితరులు పాల్గొన్నారు

## సంస్థాన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్ జన్మదిన వేడుకలు...



సంస్థాన్ నారాయణపురం, జూలై 16( ప్రభాత సూర్య)

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆరుట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ%శీ% మైనార్టీ నాయకుడు. యండి రహీం షరీఫ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జంగయ్య గౌడ్ కు మూడు రంగుల తలపగాపెట్టీ కేక్ కట్ చేయించి శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు కావాలి బుగ్గ రాములు ముదిరాజ్, నారాయణ పురం మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు విరమల్ల వెంకటేష్ గౌడ్, జక్కిడిబాల్ రెడ్డి,రత్తుపల్లి యాదయ్య,రాసాల వెంకటేష్,అందే యాదయ్య యాదవ్,శంకర్ గౌడ్, యండి.వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## బాసర ట్రిపుల్ ఐటీకి ఆదర్శ పాఠశాల విద్యార్థిని గంగ చౌదరి ఎంపిక

చౌటుప్పల్.జులై 16. ప్రభాత సూర్య:



యాదాద్రి భువనగిరి జిల్లా,చౌటుప్పల్ పురపాలక కేంద్రం,లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాలకు చెందిన గోణిగుంట్ల గంగ చౌదరి గత మార్చి నెలలో జరిగిన పదో తరగతి ఫలితాల్లో 538 మార్కులు సాధించి బాసర ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ సరస్వతి బుధవారం పత్రికకు ఇచ్చిన ప్రకటన ద్వారా తెలియజేశారు.విద్యార్థిని జి.గంగా చౌదరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

## తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘానికి అవార్డు



**తుర్కయంజాల్,జూలై 16, ప్రభాత సూర్య:** ఉత్తమ ప్రతిభ కనబరిచిన తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘానికి నాబార్డు అవార్డు అందించింది. నాబార్డు 44వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నాబార్డు సీజీఎం బి.ఉదయ్ భాస్కర్ చేతుల మీదుగా డీసీసీబీ కొత్తకుర్మ సత్తయ్య, బ్యాంకు సీఈవో రాందాసు అందుకున్నారు. తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం గోదాముల నిర్వహణ , లాకర్ల సదుపాయము, రైతులకు నాణ్యమైన ఎరువుల సరఫరా, వ్యవసాయ మరియు వ్యవసాయేతర ఆర్థిక సేవలు, సంఘ ఆధ్వర్యములో చేపట్టిన సామాజిక కార్యక్రమాలతో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు ప్రశంసా అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీజీ కాబ్ చైర్మన్ ఎం.రవీందర్ రావు, ఆర్సీఎస్ సురేంద్రమోహన్, నాఫ్స్ కాబ్ చైర్మన్ కె. రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా కారోబార్ సంఘం జిల్లా అధ్యక్షులుగా ముత్యాల చంద్రకాంత్


సంస్థాన్ నారాయణపురం, జూలై 16( ప్రభాత సూర్య):



కారోబార్ బిల్ కలెక్టర్ సంఘం జిల్లా అధ్యక్షులుగా యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన ముత్యాల చంద్రకాంత్ ని ఏకగ్రీవంగా అనుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఆయనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ జిల్లాలోని గ్రామపంచాయతీ కారోబార్ బిల్ కలెక్టర్ల సమస్యల హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైన కారోబర్ జెఏసి కమిటీకి ఎల్లప్పుడూ అందుబాటులోనే ఉండి సమస్యల పరిష్కారం కోసం కలిసి పోరాడుదాం అని సభ్యులకు భరోసా ఇచ్చారు

## కురుమల సామూహిక భవన నిర్మాణానికి హామీ

**ఎమ్మెల్యే మాల్ రెడ్డి రంగారెడ్డి**



**తుర్కయంజాల్,జూలై 16, ప్రభాత సూర్య:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి తొర్రూరులో నూతనంగా నిర్మిస్తున్న బీరప్ప ఆలయాన్ని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పరిశీలించారు. ఆలయంలో జరుగుతున్న పనులను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకురావాలని సూచించారు. ఆలయ పనులను త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. ఆలయానికి చెందిన భూమిని పరిరక్షిస్తామని మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. అలాగే కురుమల సామూహిక భవన నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కురుమ సంఘం అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మాల్ రెడ్డి యాదిరెడ్డి, నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి,నక్క శివలింగంగౌడ్,మాజీ సర్పంచ్ మేకం లక్ష్మి,దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు మేకం యాదయ్య,ఉపాధ్యక్షులు మేకం జంగయ్య, శాగ రమేష్, జనరల్ సెక్రటరీ మేకం లింగం,కోశాధికారి కొశికె యాదగిరి, కమిటీ సభ్యులు శాగ ఎల్లయ్య,మేకం కొమురయ్య, మేకం భిక్షపతి, కొశికె లింగం, మేకం శ్రీశైలం, చినిగి రాజు, రాజ్‌కిరణ్, మేకం భాష, పెద్ద కురుమ శాగ లక్ష్మయ్య, శిలువోజి చినిగి జంగయ్య, మేకం యాదగిరి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీకి నిలువుటద్దం మార్కెట్ యాకూబ్




ఖమ్మం( సూర్య ప్రతినిధి)

ఖమ్మం నగరం త్రీ టౌన్ గాంధీనగర్ ప్రాంతానికి చెందిన షేక్ యాకూబ్ హైస్కూల్ విద్యా పూర్తికాగానే ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిషన్ వ్యాపారి వీర్ల వెంకటరత్నం యాదవ్ వారి కుమారుడు వీర్ల వరప్రసాద్ యాదవ్ ల వద్ద 55 సంవత్సరాల పైగా నిజాయితీగా కమిట్మెంట్ తో ఒకే కుటుంబం వద్ద గుమస్తాగా పనిచేశారు. అనంతరం అదే ఖమ్మం మిర్చి మార్కెట్ లో కమిషన్ వ్యాపారిగా రైతుల సేవలో కొనసాగుతున్నారు. యకూబ్ మొదటి నుండి ఎన్టీఆర్ కి తెలుగుదేశం పార్టీకి వీరాభిమానిగా కొనసాగారు. టిడిపి కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొనేవారు. ఖమ్మం జిల్లాలో దూదేకుల సంఘం అభివృద్ధిలో సంఘం వ్యవస్థాపకుడు పకీర్ సాహెబ్ తో కలిసి దూదకుల సంఘం ఐక్యత కోసం కృషి చేశారు. యకూబ్ సమాజసేవ కార్యక్రమాలలో ముందు ఉండేవారు. పేద కార్మికులకు పేద ప్రజలకు నేనున్నానంటూ భరోసా కల్పించేవారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అనుచరుడిగా కాంగ్రెస్ పార్టీ లో కొనసాగుతున్నారు. యాకుబ్ కుమారుడు షేక్ లతీఫ్ ప్రస్తుతం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా మంత్రి తుమ్మల నాగేశ్వరావు సహకారంతో నియమితులైనారు. వారి కుటుంబం అంతా ఖమ్మం మార్కెట్లో రైతుల సేవలో ఉన్నారు. యకూబ్ ఈ నెల 9న అనారోగ్యంతో మృతి చెందారు. యాకూబ్ కుటుంబాన్ని దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బడే సాహెబ్ ఖమ్మం జిల్లా అధికార ప్రతినిధి అమర్ పాషా జిల్లా నాయకత్వం పరామర్శించి నివాళులర్పించారు. యాకూబ్ మృతి దూదేకుల సంఘానికి తీరని లోటు అని అన్నారు.

## నాగంపల్లి భీంపురం రోడ్డు పనులు ప్రారంభం



్గమద్దూర్ జులై 16 ప్రభాత వార్త

నారాయణపేట జిల్లా మద్దూరు మండల పరిధిలోని భీంపురం నాగంపల్లి రోడ్డు పనులను బుధవారం రోజు సింగిల్ విండో ఛైర్మన్ జి నరసింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీన్పురం నుంచి నాగంపల్లి వరకు ఒక్క కిలోమీటర్ వరకు ఒక కోటి ?60 లక్షల రూపాయల బడ్జెట్ తోని ప్రారంభించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలో తీసుక వెళ్లాలని ఆలోచనతోని కోట్ల రూపాయలు అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీరేష్ గౌడ్, హనుమంత్, బర్ల చిన్న మల్లికార్జున్, కుక్కల బాలరాజ్, లక్ష్మణ్, గణపతి చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు

## మాట ఇచ్చి.. నెరవేరుస్తున్న మునుగోడు ముద్దుబిడ్డ



మర్రిగూడ :ప్రభాత సూర్య

మర్రిగూడ మండలంలో నీ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మునుగోడు ముద్దుబిడ్డ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు, అదనపు గదుల నిర్మాణానికి మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం రోజు నా శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు, ఇటీవల పాఠశాల సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యేకు గదుల కొరత ఉన్నటువంటి సమస్యలు సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు తక్షణమే గదుల కొరత, బాత్రూములు, ప్రహరీ గోడ నిర్మాణానికి ఆయన మాట ఇచ్చారు ఇచ్చిన మాట ప్రకారం గదులు, బాత్రూములు ప్రహరీ గోడ నిర్మిస్తున్నారు


## భువనగిరిలో మినర్వా హొటల్ ని ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

భువనగిరి , జులై 16 ( ప్రభాత సూర్య):



భువనగిరి బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మినర్వా హొటల్ ని ఆర్ అండ్ బి , సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు . ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మినర్వా హొటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు . మంచి రుచికరమైన వంటలు చేస్తూ పరిశుభ్రత పాటిస్తూ ప్రజలకు సేవలు అందించాలని కోరారు . ఒక్కసారి మన హొటల్ భోజనం చేస్తే అమ్మ చేతి వంట గుర్తుకు రావాలని అన్నారు . ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య , భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి , గ్రంధాల ఛైర్మన్ అవేజ్ చిస్తి, హొటల్ మేనేజింగ్ డైరెక్టర్స్ కొత్తకాపు రుకేష్ రెడ్డి , ఆర్ ప్రణీత్ , కొత్తకాపు మణికాంత్ రెడ్డి , కొత్తకాపు శైని రెడ్డి , దేవి చాందిని , కొత్తకాపు శ్రీనివాస్ రెడ్డి , ఆర్ ఆనంద్ స్వామి తదితరులు పాల్గొన్నారు .

# మైనార్టీల అభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ కృషి




**ఎమ్మెల్యే మాల్ రెడ్డి రంగారెడ్డి**

తుర్కయంజాల్,జూలై 16, ప్రభాత సూర్య:

రాష్ట్రంలోని మహిళలందరినీ ఆర్థికంగా బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇందిరమ్మ మహిళా శక్తి కింద మంజూరైన కుట్టు మిషన్లను మైనార్టీ కమిషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలిసి రంగారెడ్డి పంపిణీ చేశారు. తొర్రూరులోని ఓ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ కృషి చేస్తుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ప్రస్తుతం 200మంది మైనార్టీలకు కుట్టుమిషన్లు అందజేస్తున్నామని, త్వరలోనే మరో 500మందికి ఇస్తామన్నారు. మహిళలకు కుట్టుమిషన్లు ఇవ్వడమే కాకుండా, ప్రభుత్వం పనికూడా కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టే ప్రక్రియను మహిళలకే అప్పగిస్తామన్నారు. పేదలను ఆదుకోవడమే ధ్యేయంగా స్థలాలున్నవారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, స్థలాలు లేనివారికి ప్రభుత్వ భూమిని చూపి త్వరలోనే ఇళ్లు కట్టించే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్‌రెడ్డి యాదిరెడ్డి, వంగేటి గోపాల్‌రెడ్డి, నక్క శివలింగం గౌడ్, భాస్కర్‌చారి,తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్ రెడ్డి,డిఇ బిక్షపతి, ఏఈ చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

# గమ్యం మరచి.. యువత గంజాయి వైపు

# గ్రామాల్లో మత్తుకు బానిసలవుతున్న భవిష్యత్ తరం

సంస్థాన్ నారాయణపూర్, జూలై 16( ప్రభాత సూర్య):

గ్రామీణ యువతలో ప్రమాదకరమైన మార్పులు కనిపిస్తున్నాయి. ఉద్యోగాలు, వ్యవసాయం, పరిశ్రమలపై దృష్టిపెట్టాల్సిన వయసులో కొంతమంది యువకులు గంజాయి, మత్తు మందులు, మద్యం వంటివాటికి బానిసలవుతున్నారు. గ్రామాల్లో విద్య, శ్రమతో ఎదగాల్సిన యువత ు మత్తు పదార్థాల వలలో పడిపోతున్నారు. ఇది ఒక్క కుటుంబ సమస్య కాదు ు సమాజం మొత్తానికి ముప్పుగా మారుతోంది.

ఒక తల్లి కన్నీటి మాటల్లో ఇలా చెబుతోంది:

"నా కొడుకు ఇంటి ఆస్తులు అమ్మి మద్యం తాగడానికే వాడుకుంటున్నాడు. రోజురోజుకీ మనిషిగా తగ్గిపోతున్నాడు..."

గంజాయి, డ్రగ్స్, మద్యం లాంటి నాశనకర అలవాట్లకు బానిసలవుతున్నారు.

పొలం పనులు మానేస్తున్నారు, చదువు పట్టడం లేదు, కుటుంబాల మీద బాధ్యతలు మరిచిపోతున్నారు.

చెత్తా స్నేహితుల ప్రభావం, సోషల్ మీడియా ద్వారా చొరబడుతున్న మత్తు పదార్థాలు ు ఇవన్నీ గ్రామాలలో శాంతిని కల్లోలానికి గురి చేస్తున్నాయి.

ఇది ఒక ఇంటి బాధ కాదు ఒక సమాజపు నిద్ర లేకపోవడం.

– గ్రామాల్లో యువతకు మార్గదర్శనం కావాలి



– నిత్యం గమనించే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చైతన్యవంతులు కావాలి.

–గ్రామ పంచాయతీలు, పోలీస్ వ్యవస్థ, యువజన సంఘాలు చట్టబద్ధంగా చొరవ చూపాలి

ఈనాటి యువతను వదిలేస్తే, రేపటి గ్రామాలు చీకట్లోకి వెళతాం

ఇప్పుడే మేలుకోండి – యువతను గెలిపించండి, దేశాన్ని

# సామాజిక ఉద్యమ ధీరుడు

# ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ కన్నుమూత

ప్రముఖుల ఘన నివాళి

జనగామ వైద్య కళాశాలకు ప్రభంజన్ పార్థీవదేహం

**పాలకుర్తి, జూలై 16( ప్రభాత సూర్య ):** సామాజిక ఉద్యమ నాయకుడు, అట్టడుగు వర్గం నుండి ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసు సాధించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం చేసి తెలంగాణ కోసం ఉద్యోగాన్ని వదిలి తెలంగాణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ సామాజిక తెలంగాణ సాధన కోసం తుది శ్వాస వరకు పోరాటం చేసి బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు.

జనగామ జిల్లా

పాలకుర్తి మండలం గూడూరు గ్రామంలో ఒక సామాన్య గొర్రెల కాపరి యాదవ కుటుంబంలో యాదనాల కొమరమ్మ సోమయ్య దంపతులకు ప్రథమ సంతానంగా జన్మించిన డాక్టర్ యాదనాల ప్రభంజన్ యాదవ్ మొట్టమొదటి సారిగా గ్రామం నుండి ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ సాధించి ఆల్ ఇండియా రేడియో నందు విధులు నిర్వహించి, న్యూ ఢిల్లీ జాతీయ ప్లానింగ్ కమిషన్ నందు పిఆర్ఓ గా విధులు నిర్వహించి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రాజీనామా చేసారు. విద్యార్థి దశ నుండే ప్రగతిశీల వామపక్ష ఉద్యమాల కీలకపాత్ర పోషిస్తూ డోలు దెబ్బ, యాదవ ఇంటలెక్షన్ ఫోరం, సామాజిక తెలంగాణ జాక్ ఏర్పాటు చేసి నిరంతరం ప్రజలను చైతన్యం చేయడమే కాకుండా దొడ్డి కొమురయ్య చిత్రాన్ని మొట్టమొదటగా చేయించిన వ్యక్తి, సత్యశోధక సామాజిక విద్యాపీఠం స్థాపించి ఎంతోమంది విద్యార్థులకు విద్యను అందించారు. గద్దర్ తో పాటు జననాట్యమండలిపై తన ఎంఫిల్ థీసిస్ ప్రజెంట్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్టేట్ బిఎస్పి పార్టీ జనరల్ సెక్రటరీగా కార్యక్రమాలు నిర్వహిస్తూ అనేక ఉద్యమ సంఘాలతో కలిసి పని చేశారు. ఆ తర్వాత తెలంగాణ యూనివర్సిటీలో జర్నలిజం విభాగంలో ప్రొఫెసర్ గా తన సేవలను కొనసాగించి పదవీ విరమణ పొందారు. సామాజిక ఉద్యమకారుడిగా తెలంగాణ జన సేన స్థాపించి సామాజిక తెలంగాణ సాధన లక్ష్యంగా అహర్నిశలు పరితపించిన



ప్రభంజన్ మండల్ టీవీ ని స్థాపించి సోషల్ మీడియా ఛానల్ ద్వారా ఉద్యమాలు చివరి వరకు కొనసాగిస్తూ తుది శ్వాస వరకు సామాజిక న్యాయం కోసం మేం ఎంతో మందిమో మాకు అంత వాటా నినాదంతో బహుజన ఉద్యమాన్ని నడిపిస్తూ అనేక సభలు సమావేశాలు నిర్వహించారు. బహుజన మీడియా, ద వాయిస్ ఆఫ్ వాయిస్ లెస్ లాంటి ఎన్నో పుస్తకాలను రచించి బ్రతికున్నంత కాలం విద్యార్థులకు, సమాజానికి ఉపయోగపడినట్లే తన మరణానంతరం కూడా వైద్య విద్యార్థులకు తన శరీరం ఉపయోగపడాలనే సామాజిక స్ఫూర్తితో చివరగా తన భౌతిక దేహాన్ని సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనగాం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ కి సమర్పించారు. ప్రభంజన్ మహోన్నతమైన ఆశయాన్ని కొనియాడుతూ వారి ఆశయాన్ని గౌరవించి నెరవేర్చిన భార్య డాక్టర్ రేఖ, కుటుంబ సభ్యులు పార్థిన దేహాన్ని వైద్య కళాశాలకు ఇచ్చినందుకు పలువురు ప్రముఖులు అభినందించారు. కుమారులు విశ్వామిత్ర, సత్యశోధక్ సోదరులు రమేష్, శ్రీనివాస్, వీరాస్వామి, డాక్టర్ దాడబోయిన శ్రీకాంత్, బావలు రవీంద్ర, బద్రి, రాంచందర్, రాజయ్యలకు గ్రామ మాజీ సర్పంచులు పుల్లయ్య, కొంరయ్య పోతన చైతన్య వేదిక సభ్యులు, సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, వరంగల్ ఉమ్మడి జిల్లాల ప్రతినిధులు కర్రేటి శంకర్రావు, సి. హెచ్ దళపతి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

ప్రభంజన్ పార్థీవ దేహాన్ని హైదరాబాద్ ఆసుపత్రి నుండి పాలకుర్తి మండలం గూడూరు గ్రామానికి తీసుకొచ్చి తను స్థాపించిన పాఠశాలలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. పాలకుర్తి నియోజకవర్గ ప్రజలే కాకుండా రాష్ట్ర నలుమూలల నుండి తరలివచ్చిన ప్రముఖులు ఆయనకు జోహార్లు తెలిపి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్మన్ వెన్నెల గద్దర్, హిందూ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్లు, ఆల్ ఇండియా ఒబిసి జాక్ ఛైర్మన్ సాయిని నరేందర్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, సిపిఐ ఎం ఎల్ లిబరేషన్ పార్టీ జనగామ జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజుల సాంబయ్య, రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, న్యాయవాది కదిరే కృష్ణ, వివిధ సంఘాల అధ్యక్షులు కొంగర నరహరి, అమరేందర్, పెండ్లి అశోక్ బాబు, కోలా జనార్దన్ గౌడ్, మల్లేష్, సామాజిక ఉద్యమకారులు డాక్టర్ రాపోలు సత్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పులి గణేష్, సంఘీ వెంకన్న, సింగారం దీపక్, మాజీ దేవస్థానం ఛైర్మన్ చిలువేరి కృష్ణమూర్తి, తిరుమలగిరి సర్పంచ్ పుల్లయ్య, గూడూరు తాజా మాజీ సర్పంచ్ మంద కొమురయ్య, ఎదునూరి మదర్, మాన్యపు విజేందర్ తదితరులు ఆయన అంతిమ యాత్రలో పాల్గొని ప్రభంజన యాదవ్ ఆశయాల సాధనకై కృషి చేస్తామని నినదించారు. జనగామ వైద్య కళాశాల వద్దకు టిఆర్ఎస్ నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, సీనియర్ పాత్రికేయులు కన్నా పరుశరాములు తదితరులు చేరుకొని నివాళులు అర్పించారు.


## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలి

**నార్సింగి మున్సిపాలిటీ 17 వ వార్డు మాజీ కౌన్సిలర్ ఉషారాణి**

గండిపేట్, : సూర్య ప్రతినిధి

నార్సింగి గ్రామ ప్రజలు అమ్మవారి ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలని నార్సింగి మున్సిపాలిటీ 17 వ వార్డు మాజీ కౌన్సిలర్ ఉషారాణి ఆకాంక్షించారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ప్రజలకు ఆమె బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతోని ఉండటంతో పాటు వర్షాలు బాగా కురవాలని, సిరిసంపదలతో ఆరోగ్య, ఐశ్వర్యాలతో ప్రజలంతా ఎల్లవేళలా సంతోషంతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. లక్ష్మమ్మ, పోచమ్మ తల్లుల దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు వివరించారు.





# రష్మిక 'గర్ల్‌ఫ్రెండ్' నుంచి తొలి పాట రిలీజ్

సాధారణంగా డ్యాన్స్ అనగానే గంతులు వేయడం లాంటి స్టెప్స్ చాలా వరకు ఉంటాయి. కానీ రష్మిక మాత్రం కాస్త డిఫరెంట్ సాంగ్‌లో కనిపించింది. డ్యాన్స్ కూడా అందుకు తగ్గట్లే ఉంది. ఈమె ప్రధాన పాత్రలో నటించిన 'ద గర్ల్ ఫ్రెండ్' మూవీ త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే తొలి పాటని రిలీజ్ చేసి ప్రమోషన్స్ మొదలుపెట్టారు. 'నదివే' అంటూ సాగిన ఈ పాట.. ప్రేమ సాహిత్యం తరహాలో వెరైటీగా ఉంది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రష్మిక లీడ్ రోల్ కాగా, 'దసరా' ఫేమ్ దీక్షిత్ శెట్టి ఈమె సరసన నటిస్తున్నాడు. యానిమల్, పుష్ప 2, ఛావా తదితర సినిమాలతో పాన్ ఇండియా వైడ్ బ్లాక్ బస్టర్స్ అందుకున్న రష్మిక చేసిన లేడీ ఓరియెంటెడ్ మూవీ ఇది. అల్లు అరవింద్ నిర్మించారు. తాజాగా రిలీజ్ చేసిన పాట చూడటానికి వినటానికి బాగానే ఉంది. మూవీని సెప్టెంబరు 5న విడుదల చేయాలనే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు తెలుస్తోంది.

# బ్లాక్ డ్రెస్సులో శ్రద్ధా దాస్ అందాల విందు





# 'స్పిరిట్' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా

ఇంటర్నెట్ డెస్క్: ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు నటి త్రిప్తి డిమ్రి ఆమె నటించిన 'ధడక్ 2' ఆగస్టు 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన అప్‌కమింగ్ చిత్రాల గురించి పంచుకున్నారు. సందీప్ వంగా దర్శకత్వంలో తాను నటించిన 'స్పిరిట్' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. "విభిన్నమైన కథల్లో నటించినప్పుడే నటిగా ఎదుగుదల ఉంటుంది. ఇండస్ట్రీలోని టాలెంటెడ్ డైరెక్టర్ల సినిమాల్లో నటించే అవకాశం రావడం గొప్ప బహుమతి. వేర్వేరు వ్యక్తులతో పనిచేయడం మంచి అనుభవం. వారి నుంచి ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవచ్చు. అవి కెరీర్‌కు ఎంతో ఉపయోగపడతాయి. నేను విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నాను. ఈ ఏడాదిలోనే అది విడుదల కానుంది. దానితో పాటు 'స్పిరిట్'లో నటిస్తున్నా. దీన్ని సందీప్ వంగా గొప్పగా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం విడుదల కోసం ఉత్సాహంగా ఉన్నాను. 'స్పిరిట్' ఓ అందమైన చిత్రం" అని త్రిప్తి తెలిపారు. జాన్వీ కపూర్ తొలి సినిమా 'ధడక్'. విజయవంతమైన ఈ రొమాంటిక్ ఫిల్మ్‌కు సీక్వెల్‌గా 'ధడక్ 2' రూపొందింది. అయితే ఈ సీక్వెల్‌లోనూ జాన్వీ నటిస్తారని అనుకున్నారు. అయితే ఆమెకు బదులుగా త్రిప్తిని తీసుకున్నారు దర్శకుడు. షాజియా ఇక్బాల్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ధడక్'లో సిద్ధాంత్ చతుర్వేది సరసన త్రిప్తి కనిపించనున్నారు. ఇక ప్రభాస్ హీరోగా రానున్న 'స్పిరిట్' సినిమా కోసం సందీప్ వంగా మొదట దీపికా పదుకొణెను సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. తర్వాత కొన్ని రోజులకు ఈ ప్రాజెక్ట్‌లో త్రిప్తిని తీసుకుంటున్నట్లు టీమ్ ప్రకటించడం గమనార్హం.



# అవకాశాల వేటలో సక్సెస్‌ఫుల్ హీరోయిన్

ఒక్కోసారి సక్సెస్‌ఫుల్ నటి అని ముద్ర వేసుకున్నా అవకాశాలు ముఖం చాటేస్తుంటాయి. నటి ప్రియాంక మోహన్ పరిస్థితి ఇప్పుడు ఇలానే ఉంది. ఈ కన్నడ భామ మాతృభాషతో పాటు తెలుగు, తమిళం భాషల్లోనూ నటిస్తూ దక్షిణాది కథానాయకిగా పేరు తెచ్చుకున్నారు. ఈమె 2019లో కన్నడ చిత్రంతో కథానాయకిగా ఎంట్రీ ఇచ్చారు. ఆ తరువాత తెలుగులో నాని గ్యాంగ్‌లీడర్ చిత్రంలో నటించే అవకాశాన్ని అందుకున్నారు. ఆ చిత్రం ఓకే అనిపించుకుంది. ఆ తర్వాత తమిళంలో శివకార్తికేయన్‌కు జంటగా డాక్టర్, డాన్ చిత్రాల్లో వరుసగా నటించి మంచి విజయాన్ని అందుకున్నారు. అంతేకాకుండా గ్లామర్‌కు దూరంగా పక్కింటి అమ్మాయి ఇమేజ్‌ను సంపాదించుకున్నారు. ఇలా సూర్యతో ఎదర్కుమ్ తుణిందవన్ (ఈటీ), ధనుష్ సరసన కెప్టెన్ మిల్లర్ వంటి చిత్రాల్లో నటించి పాపులర్ అయ్యారు. ఆ మధ్య తెలుగులో నాని సరసన 'సరిపోదా శనివారం' చిత్రంలో నటించి మరో హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. అలాంటిది ఆ తరువాత అవకాశాలు కరువయ్యాయి. నటుడు ధనుష్ దర్శకత్వం వహించి నిర్మించిన 'జాబిలమ్మా నీకు అంత కోపమా' చిత్రంలో ప్రత్యేక పాటలో నటించారు. అంతే ఆ తరువాత తమిళంలో మరో అవకాశం రాలేదు. తెలుగులోనూ ఓజీ అనే ఒకే ఒక్క చిత్రం చేతిలో ఉంది. దీంతో మడి కట్టుకొని కూర్చుంటే ప్రయోజనం ఉండదని గ్రహించారో ఏమోగానీ గ్లామర్‌కు తెర రేపింది. తాజాగా వివిధ భంగిమల్లో ఫొటోలు తీయించుకుని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. అందులో కొన్ని బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు చోటు చేసుకున్నాయి. ఈ ఫొటోలు ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి.

# క్రైమ్ థ్రిల్లర్ 'ఆ గ్యాంగ్ రేపు 3' ట్రైలర్ రిలీజ్



వైరల్ షార్ట్ ఫిల్మ్ 'ఆ గ్యాంగ్ రేపు' సిరీస్ నుంచి మూడో భాగం, 'ఆ గ్యాంగ్ రేపు-3' ట్రైలర్ విడుదలైంది. ఇది త్వరలోనే ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఇంతకు ముందు 45 మిలియన్లకు పైగా వ్యూస్‌తో 'ఆ గ్యాంగ్ రేపు' వైరల్ అవగా, దానికి కొనసాగింపుగా వచ్చిన 'ఆ గ్యాంగ్ రేపు-2' కూడా విమర్శకుల ప్రశంసలు పొందింది. దర్శకుడు యోగి కుమార్ ఈ క్రైమ్ థ్రిల్లర్‌ను ఎంతో భావోద్వేగంగా, వాస్తవానికి దగ్గరగా, ప్రేక్షకుల హృదయాలకు హత్తుకునేలా తెరకెక్కించారు. గతంలో ఆయన దర్శకత్వం వహించిన తొలి ఫీచర్ ఫిల్మ్ 'లవ్ యూ టూ' కూడా ఓటీటీలో మంచి ఆదరణ పొందింది. 'ఆ గ్యాంగ్ రేపు-3'తో దర్శకుడిగా తనకు మరింత గుర్తింపు వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో నరేన్ అన్నసాగరం మరియు ప్రీతి సుందర్ హీరో హీరోయిన్లుగా నటించారు. సహచర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నోక్షియస్ నాగ్స్ నిర్మించిన ఈ చిత్రానికి, నాని ఐనవెల్లి అందించిన హ్యాండ్ హెల్డ్ స్టైల్ సినిమాటోగ్రఫీ విజువల్స్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చింది. కథన వేగం, మూడ్‌ను పక్కాగా నిలబెట్టిన ఎడిటర్ అనిల్ కుమార్ జల్లు ఎడిటింగ్, సినిమా టెన్షన్‌ను అద్భుతంగా పటిష్టం చేసింది. 2017లో మొదటి షార్ట్ ఫిల్మ్ అవార్డు గెలుచుకున్న, కన్నడ హిట్ 'షుగర్ ఫ్యాక్టరీ'కి సంగీతం అందించిన కబీర్ రఫీ అందించిన నేపథ్య సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్, విడుదల తేదీ త్వరలో ప్రకటించబడతాయి. ఈ సందర్భంగా జరిగిన పాత్రికేయుల సమావేశంలో నటుడు, కొరియోగ్రాఫర్ ఆటా సందీప్ మాట్లాడుతూ.. 'ఆ గ్యాంగ్ రేపు' షార్ట్ ఫిల్మ్‌గా వైరల్ అయ్యింది. దాని రెండో భాగంలో నేను నటించాను, అది కూడా బాగా హిట్టయ్యింది. 'ఆ గ్యాంగ్ రేపు 3' కోసం కూడా అడిగారు, కానీ నేను ఒప్పుకోలేదు. నేను కొరియోగ్రాఫర్‌గానే ఉండాలనుకుంటున్నాను. ఇంత బోల్డ్‌గా ఉన్న పాత్రను చేయాలనుకోలేదు. అందుకే ఈ సినిమా చేయలేదు. చాలా కారణాలతో ఈ సినిమా చేయలేదు. ఈ టీమ్‌తో నాకు చాలా మంచి స్నేహం ఉంది. ఫీచర్ ఫిలిం చేసి, కథ నచ్చి ఓటీటీ కోసం మంచి ప్యాషన్‌తో ఈ సినిమా చేశారు. ఈ ట్రైలర్ చాలా బోల్డ్‌గా ఉంది. నేడు సమాజంలో జరుగుతున్న పరిణామాలను కూడా ఈ సినిమాలో దర్శకుడు చర్చిస్తున్నాడు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.